ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

మామిడి కోతలకు వెళ్లి...

● శవాలుగా తిరిగొచ్చారు... ● శెట్టిగుంట గిరిజన కాలనీలో విషాదం

- కన్నీరుమున్నీరైన గిరిజన కాలనీ మృతుల కుంటుంబాలు
- శెట్టిగుంట, శ్రీకాళహస్తి గిరిజన కాలనీలకు చేరిన మృతదేహాలు

రైల్వేకోడూరు/రాజంపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వారంతా వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన కాలనీలకు చెందిన వ్యవసాయ కూలీలు. మామిడి సీజన్ ప్రారంభమైందంటే వారు కాయల కోతలకు వెళుతుంటారు. అలాగే ఆదివారం రాజంపేటలోని ఇసుకపల్లెలో మామిడికోతకు వెళ్లారు. పని ముగించుకుని లారీలో కాయలను వేసుకుని వస్తుండగా పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద ఆదివారం రాత్రి లారీ బోల్తా పడి 9 మంది మృత్యువాతపడ్డారు. మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట గిరిజన కాలనీకి చెందివారు కాగా మిగిలిన ఐదుగురు శ్రీకాళహస్తి పరిధిలోని కల్వకుంట గిరిజన కాలనీకి చెందిన వారిగా గుర్తించారు. సోమవారం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శవ పరీక్షల అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించారు.

మండలంలోని శెట్టిగుంట గిరిజన కాలనీలో 100 కుటుంబాలు ఉన్నాయి. 100కు పైగా జనాభా ఉన్నారు. మొత్తం 40 ఇళ్లు ఉన్నాయి. వీరంతా వ్యవసాయ కూలీలు. ప్రతిరోజూ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. మామిడి సీజన్ వచ్చిందంటే తిరుపతి జిల్లా వెంకటగిరి, శ్రీకాళహస్తి పరిధిలోని కల్వకుంట గిరిజన కాలనీ వాసులు పది రోజుల ముందే శెట్టిగుంట గిరిజన కాలనీకి చేరుకుంటారు. అందరూ స్వయాన బంధువులు. సీజన్ మొదలు కాగానే ఉమ్మడిగా మామిడి కోతలకు వెళుతుంటారు. కోతలు పూర్తి కాగానే వారి ఇళ్లకు వెళ్లిపోతారు. ఇలా ప్రతి ఏడాది ఉమ్మడిగా మామిడి కోతలకు వెళ్లడం సంప్రదాయంగా పెట్టుకున్నారు. రోడ్డు ప్రమాదంలో 9 మంది మృతి చెందడంతో ఆ కాలనీల్లో తీవ్ర విషాదం నెలకొంది. కాగా ప్రమాదంలో గజ్జల శ్రీను, వి.శ్రీనులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. గజ్జల శ్రీను కడపలోని ఓ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నాడు. వి.శ్రీను తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



శెట్టిగుంట గిరిజన కాలనీలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు



గజ్జల గంగమ్మ, చిట్టెమ్మ, రాధమ్మ, వడమంచి శ్రీను, గజ్జల సుబ్బరత్న (ఫైల్)

భార్య, భర్త మృత్యువాత



మామిడి కోతలకు వెళ్లిన భార్యాభర్తలు మృత్యువాత పడ్డారు. శెట్టిగుంట గిరిజన కాలనీకి చెందిన గజ్జల దుర్గయ్య, గజ్జల గంగమ్మలకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో వారి పిల్లలు అనాథలుగా మిగిలారు.

గజ్జల దుర్గయ్య దంపతులు (ఫైల్)

సంఘటన జరిగిన నుంచి శవపరీక్ష వరకు...

ప్రమాదం జరిగిందని తెలుసుకున్న శెట్టిగుంట సర్పంచ్ శివశైలజ భర్త చంద్ర, రైతు నాయకుడు నాగినేని వెంకటరమణ, గ్రామస్థులు రాత్రి నుంచి మధ్యాహ్నం వరకు దగ్గర ఉండి సహాయక చర్యలు చేపట్టారు. సంఘటన ప్రాంతం నుంచి శవాలను రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి... శవపరీక్షలు పూర్తయి అంబులెన్సుల్లో ఆయా గ్రామాలకు చేర్చే వరకు వారే దగ్గరుండి చూసుకున్నారు. అలాగే అంత్యక్రియలు శెట్టిగుంటలో నలుగురికి చేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

అధిక లోడుతో వెళ్లడమే ప్రమాదానికి కారణం

మామిడి కాయల లారీ అధిక లోడుతో వెళ్లడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మామిడి కాయలను సీజన్‌లో అధిక లోడుతో తీసుకెళుతుండటంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదానికి గురైన ఐషర్ లారీ ఆరు టైర్ల లారీ. ఈ లారీలో సాధారణంగా 6 టన్నులు మాత్రమే వేసుకోవాల్సి ఉండగా దాని కంటే ఎక్కువగా మామిడి కాయలను వేశారు. ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసి ఆ తర్వాత ముందు వచ్చే కారును తప్పించాలని చూసి బోల్తాపడడంతో ఇంత ఘోర ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు

లారీ ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, సీఐ వి.వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేశ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఆర్‌టీవో, రాజంపేట బ్రేక్‌ఇన్‌స్పెక్టర్, జాతీయ రహదారి అధికారులు తదితరులు పరిశీలించారు.

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు అందజేత

ప్రమాదంలో మృతి చెందిన శెట్టిగుంట గిరిజనకాలనీ వాసుల కుటుంబాలను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌ఛార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిలు పరామర్శించి ముక్కా ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున చెక్కులు అందచేశారు. కాగా టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, రైతు నాయకుడు నాగినేని వెంకటరమణ, ప్రముఖ న్యాయవాది చంద్ర మృతుల కుటుంబాలను పరామర్శించారు.



సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి

మృతుల బంధువుల ఆర్తనాదాలతో రాజంపేట ఆసుపత్రి ప్రాంగణం దద్దరిల్లింది. కూలీ కోసం వెళ్లి కాటికెళ్లారా అంటూ వెక్కి వెక్కి ఏడ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌కుమార్, జనసేనపార్టీ నాయకులు శ్రీనివాసరాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగుంట రమేశ్‌నాయుడు, జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ నేతలు తదితరులు మృతదేహాలను పరిశీలించి వారి బంధువులను ఓదార్చారు. ఈ సందర్భంగా మృతుల సామాజిక వర్గానికి చెందిన పలువురు గిరిజనులు కలిసి ఆసుపత్రి ప్రాంగణం వద్ద తమ వారికి వెనువెంటనే న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. హృదయవిదారక సంఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రమాదాలకు నిలయంగా మారిన రెడ్డిపల్లె చెరువుకట్టను వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు.



రాజంపేట ఆస్పత్రి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే, కుడా చైర్మన్ ముక్కా

అమ్మ, అవ్వ ఎక్కడ తాత...

ప్రమాదంలో శెట్టిగుంట గిరిజన కాలనీకి చెందిన సుబ్బరత్న, చెంచమ్మలు మృతి చెందారు. ఆదివారం రాత్రి ఇంటికి రావాల్సిన తల్లి, అవ్వలు రాకపోవడంతో పిల్లలు గౌతం, శ్రీనులు ముద్ద కూడా ముట్టలేదు. రాత్రి నుంచి అమ్మ, అవ్వల కోసం ఎదురు చూశారు. తాత ఎంత సముదాయించినా పసి ప్రాణాలు తల్లి, అవ్వల కోసం వేచి ఉన్నారు. వారు ఇరువురు శవాలై రావడంతో పసి ప్రాణాలు ఒక్కసారిగా దిగమింగుకున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు.



అమ్మ, అవ్వ చనిపోవడంతో అంత్యక్రియలకు తాత వెంబడి వెళుతున్న చిన్నారులు గౌతం, శ్రీను

గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జ్ పీడీ సస్పెన్షన్



సాంబశివయ్య

రాయచోటి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వి.సాంబశివయ్యను ప్రభుత్వం సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా జిల్లా కేంద్రం వదిలి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయనపైన వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం నుంచి జిల్లా ఇన్‌చార్జ్ గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఈయన విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లోనే ఈయనపైన అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వంలోనూ ఎటువంటి చర్యలు లేవు.

ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇతడితో పాటు చిత్తూరు ఇన్‌చార్జ్ పీడీ గోపాల్‌నాయక్‌పైనా సస్పెన్స్ వేటు పడింది. రాయచోటి గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు గురుప్రసాద్, మహ్మద్ రఫి, సుధాకర్‌లను కూడా సస్పెండు చేశారు.

పుష్పం..పత్రం సమర్పయామి...

వైభవంగా ముగిసిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామికి పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. ద్వాదశ రాధనలో భాగంగా 12 రకాల పూలు చామంతి, గన్నేరు, మల్లేలు, రుక్షి, కనకాంబరాలు, రోజా, సంపంగి, తామర, కలువ, మొగలిరేకులు వంటి వివిధ రకాల పుష్పాలు, తులసి, మరువం, దవనం వంటి నాలుగురకాల ఆకులతో స్వామి అమ్మవార్లకు యాగం నిర్వహించారు. పాంచరాత్ర, ఆగమ పండితులు, రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అదికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజలను మభ్యపెట్టడానికే జనాల్లోకి జగన్

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కురబలకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పరదాల చాటున దాక్కుని, ప్రజల సమస్యలను గాలికొదిలేసి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ ప్రజలను మభ్యపెట్టడానికే జనాల్లోకి వస్తున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మండలంలోని ఒంటిల్లు తూర్పు దళితవాడు, ముదివేడు క్రాస్, దాదాంవారిపల్లె, గొల్లపల్లె, అంగళ్లు గ్రామాలలో పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్, సీసీరోడ్లు, సచివాలయంను ప్రారంభించి, ముదివేడు కేజీబీవీలో రూ.1.50 కోట్ల నిధులతో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి తొలి అడుగులో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జ్ జయచంద్రారెడ్డి, నాయకులు శ్రీరాంచినబాబు, మల్లికార్జుననాయడు, పి.సురేంద్ర యాదవ్, అయూబ్‌బాషా, రమణ, సురేంద్ర, ప్రసాద్‌రావు, సీతారాం పాల్గొన్నారు.



దళితవాడలో ప్రచారం చేస్తున్న మంత్రి, తదితరులు

తాళ్లపాక చెరువులో శివలింగం



తాళ్లపాక చెరువులో బయటపడ్డ శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్థులు

రాజంపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని తాళ్లపాక గ్రామానికి చెందిన చెరువులో పురాతన శివలింగం బయటపడింది. తాళ్లపాకను ఆనుకుని ఉన్న చెరువును అభివృద్ధి చేయాలని గ్రామస్థులు పలుమార్లు టీటీడీ అధికారులకు విన్నవిం చారు. ఈ నేపథ్యంలో సోమవారం అన్నమయ్య ధ్యానమందిరానికి ఆనుకుని ఉన్న చెరువులో పెరిగిన తుంగ, కంపను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తుండగా చెరువులో ఐదు అడుగుల ఎత్తు గల శివలింగం, పాత రోకలి బయటపడ్డాయి. ఆ చెరువులో పురాతన కాలం నుంచి ఒక శివలింగం ఉందని, ఆ చెరువులో నేరేడుమిట్ట ప్రాంతం ఉండేదని, నేరేడేశ్వరుడిగా పూజలు అందుకుంటుండేవారని గ్రామస్థులు తెలిపారు. పూ ర్వం అక్కడ గుడి ఉండి ఉండవచ్చునని అందువల్లే అక్కడ శివలింగం ఉందని పూజారులు, గ్రామస్థులు అంటున్నారు. తాళ్లపాకలో బ్రహ్మోత్సవాల సందర్భంగా చక్రస్నానం పూర్తి కాగానే పూజారులు చెరువులోని శివలింగం వద్దకు వెళ్లి అక్కడ శివలింగాన్ని శుభ్రపరిచి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉసూరుమనిపించిన నైరుతి



పీటీఎం మండలం కందుకూరు వద్ద దుక్కులు దున్ని బీళ్లుగా వదిలేసిన చేను

- వేరుశనగ సాగుకు ముగిసిన అదును
- మూడేళ్లతో పోలిస్తే అతి తక్కువ వర్షపాతం
- గృహోపయోగానికే సబ్సిడీ విత్తనం

నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ మొదటి వారంలోనే వర్షాలు విస్తారంగా కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనలతో రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేసింది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్‌లో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. రైతులు చేసేది లేక సబ్సిడీ ధరలతో కొనుగోలు చేసిన విత్తనాలను చట్నీలకు వాడుకుంటున్నారు

మదనపల్లె టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే మే నెల నుంచి కురిసే వర్షాలపైనే జిల్లాలో వేరుశనగ పంట సాగు ఆధారపడి ఉంటుంది. మే, జూన్ నెలల్లో కురిసే వర్షానికి రైతులు దుక్కులు దున్ని, వేరుశనగ విత్తనాలు ఒబ్బిడి చేసుకుని, పొలంలో విత్తుతారు. మూడు నెలల కాలంలో కురిసే వర్షాలకు అనుగుణంగా, వేరుశనగ పంట రైతు చేతికి వస్తుంది. గత మూడేళ్లుగా నైరుతి రుతుపవనాలు వేరుశనగ సాగుకు అనుకూలించలేదు. ఈ ఏడాది మే నెలలో కూడా అంతంత మాత్రంగానే వర్షాలు కురిసాయి. దీంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారే గానీ, పదును కాక బీళ్లుగా వదిలేశారు. ఈ కింది గణాంకాలు చూస్తే ఈ ఏడాది వర్షపాతం ఎంత తక్కువగా నమోదు అయ్యిందో గమనించవచ్చు.

తగ్గిన సాగు విస్తీర్ణం

అన్నమయ్య జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 36 వేల ఎకరాలు కాగా, ప్రభుత్వం 35 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను సబ్సిడీపై పంపిణీ చేసింది. ఈ కాయల నుంచి ఒలిచి విత్తేందుకు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో వేరుశనగ ఎక్కువగా సాగయ్యే పీటీఎం, పెద్దమండ్యం మండలాలతో పాటు మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, రాయచోటి వ్యవసాయ డివిజన్లలో అతి తక్కువగా వర్షాలు పడ్డాయి. గత రెండేళ్లతో పోలిస్తే 150 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో అక్కడక్కడ తప్ప ఈ డివిజన్‌లో కూడా రైతులు వేరుశనగ విత్తలేకపోయారు. జిల్లా మొత్తం మీద కేవలం 4,600 ఎకరాల్లో మాత్రమే వేరుశనగ సాగైంది.



సాగుకు సిద్ధం చేసుకున్న విత్తనాలు

నేటితో ముగిసిన అదును

వ్యవసాయశాఖ క్యాలెండర్ ప్రకారం నైరుతి రుతుపవనాలు ప్రవేశించే జూన్ నెల నుంచి జూలై 15వ తేదీ వరకు వేరుశనగ విత్తనాలు విత్తేందుకు జిల్లాలోని వాతావరణం అనుకూలిస్తుంది. జూలై 15 తరువా త విత్తితే ఆశించిన మేర దిగుబడి రాదు. కొంత మంది రైతులు ఆగస్టు మొదటి వారం వరకు వర్షాలు కురుస్తాయేమో అన్న ఆశతో వున్నా, అనుకున్న మేర దిగుబడి రాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు.

చట్నీలకు, నూనెకు సబ్సిడీ విత్తనాలు

ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో 35 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయగా. ఇందులో సుమారు 4వేల క్వింటాళ్లు మాత్రమే విత్తనానికి నోచుకున్నాయి. మిగిలిన కాయల న్నీ రైతుల ఇళ్లలో నిలిచిపోయాయి. సీజన్ ముగియడంతో చాలా మంది రైతులు సబ్సిడీ విత్తనాలను వ్యాపారులకు విక్రయిం చేస్తుండగా, కొందరు ఇళ్లలో వంటకాలకు, చట్నీలకు వాడుకుంటున్నారు. మరికొందరు వేరుశనగ నూనె ఆడించుకుని భద్రపరుచుకుంటున్నారు.

ఉలవల సాగే దిక్కు.

వేరుశనగ సాగు లేకపోవడంతో ఈ సారి మెట్ట రైతులకు ఉలవల సాగే దిక్కయింది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలు ఉలవల సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో రైతులు వ్యవసాయ శాఖ అందించే ఉలవల విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అవసరమ య్యే విత్తనాలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారికి ప్రతిపాదనలు పంపుతున్నారు.

సంవత్సరం	నెల	సాధారణ వర్షపాతం (మి.మీ)	నమోదైన వర్షపాతం (మి.మీ)	తేడా
2023-24	జూన్	75.1	44.4	- 40.9
	జూలై	90.5	58.4	- 35.5
	ఆగస్టు	99.8	31.1	- 68.8
	సెప్టెంబరు	11,7	165,4	+ 44.2
2024-25	జూన్	75.1	155.6	+107.2
	జూలై	90.5	48.8	- 46.1
	ఆగస్టు	99.8	101.7	+ 1.9
	సెప్టెంబరు	114.7	61.3	- 46.6
2025-26	జూన్	75.1	26.6	- 64.6
	జూలై	37.5	3.7	- 90.2

ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. వాల్మీకిపురం మండలానికి చెందిన అంజప్ప తన కుడికాలును అనారోగ్య కారణాల రీత్యా పూర్తిగా తీసివేశారని, తనకు ద్విచక్రవాహనాన్ని ఇప్పించాలని కోరారు. నందలూరు మండలానికి చెందిన సాంబశివనాయుడు తన కూతురికి వివాహమైందని, అందువల్ల తన కూతురిని తన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నుంచి వేరు చేయాలని విన్నవించుకున్నారు. రాయచోటిలో నివసిస్తున్న చాంద్‌బాషా తనకు 75 సంవత్సరాల వయస్సు అని, ఎటువంటి పనిచేయలేని పరస్థితిలో ఉన్నానని, తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో 8 సింగిల్ విండోలకు త్రీమెన్ కమిటీలు

కలికిరి/ కడప రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 8 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (ప్యాక్స్) ముగ్గురు పాలకవర్గ సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అనంతపల్లె సొసైటీకి ఛైర్మన్‌గా ఎ.కొండయ్య, సభ్యుడుగా ఎం.గురుభాస్కర్ రెడ్డి, టి.మధుసూదన రెడ్డిలను నియమించారు. పొందలూరు ఛైర్మన్‌గా సి.వెంకటేశు, సభ్యులుగా టి.పెంచలయ్య, ఆర్.గంగాధరమ్మ, అనంతసముద్రం సొసైటీకి ఛైర్మన్‌గా ఎం.మల్లికార్జు, సభ్యులుగా ఆకేపాటి పెద్దా రెడ్డి, మేకల పట్టాభి, అనంతయ్యగారిపల్లె సొసైటీకి ఛైర్మన్‌గా నాగా లక్ష్మీకర్ రెడ్డి, సభ్యులుగా వై.నారాయణ, మల్లు శ్రీనివాసులు రెడ్డి, గాలివీడు సింగిల్ విండోకు ఛైర్మన్‌గా వి.శ్రీనివాసులు రెడ్డి, సభ్యులుగా పసుపుల శేఖర్ రెడ్డి, కొర్రు రామప్ప నాయుడు, సంబేపల్లె సొసైటీకి ఛైర్మన్‌గా వంగిమళ్ళ శివప్రసాద్ రెడ్డి, సభ్యులుగా కె.సుబ్బరాజు, పూజల రాధ, చిన్నమండెం సొసైటీకి ఛైర్మన్‌గా కోహూరి శివయ్య నాయుడు, సభ్యులుగా దేవరింటి నాగేశ్వర, పడమటికోన గంగి రెడ్డి, లక్కిరెడ్డిపల్లె సింగిల్ విండోకు ఛైర్మన్‌గా వీరబల్లి లక్ష్మీ రాజు, సభ్యులుగా చింతమాని రామసుబ్బయ్య, సిబ్యాల వెంకట్రమణను నియమిస్తూ సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

కడప జిల్లాలో నాలుగు సింగిల్ విండోలకు..

కడప జిల్లాలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్)కు ముగ్గురు పాలకవర్గ సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. లింగాపురం సొసైటీకి ఛైర్మన్‌గా సిద్దారెడ్డి నాగముని రెడ్డి, సభ్యులుగా డి.రామకృష్ణ, పసుపుల లక్ష్మీనారాయణమ్మ, వద్దిరాల సొసైటీకి ఛైర్మన్‌గా ఎ.కొండయ్య, సభ్యులుగా మందాడి గురుభాస్కర్ రెడ్డి, టంగుటూరు మధుసూదన రెడ్డిని నియమించారు. అదే విధంగా కె.అగ్రహారం సొసైటీకి ఛైర్మన్‌గా జి.ఆర్.హరినాథ రెడ్డి, సభ్యులుగా జంపన ఓబుల్ రెడ్డి, సీహెచ్ నాగేశ్వరుడు, దువ్వూరు సొసైటీకి ఛైర్మన్‌గా పోలు రామమోహన్ రెడ్డి, సభ్యులుగా ఎం.వెంకటేశ్వర రెడ్డి, బి.శివశంకర్‌లను నియమిస్తూ సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పిచ్చికుక్కల వీరంగం.. పలువురికి గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన నందకిశోర్

సిద్దవటం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నాలుగు రోజులుగా పిచ్చికుక్కలు వీరంగం చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దిగువపేట బేల్దారి వీధికి చెందిన ఫాతిమా(5), గాంధీవీధికి చెందిన కోటపాటి నందకిషోర్(6), పాల్లెం వసంత, గుర్రయ్య మరికొందరిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చికిత్స చేయించు కుంటున్నారు. ఈ విషయంపై కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళిని వివరణ కోరగా పిచ్చికుక్క కాటుకు గురైన ఐదుగురికి చికిత్స చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశామని వివరించారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్



నిందితుడు హేమవర్ధన్

సిద్దవటం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తూ జూలై 5న పట్టుబడ్డ కడప నగరానికి చెందిన రెడ్డి సురేష్ విచారణలో మరి కొంత మంది పేర్లు చెప్పడంతో సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు పలు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు, చేశారు సిద్దవటం మండలం మాధవరం, పార్వతీపురం గ్రామాల్లోని శీతలగంగమ్మ గుడి ఆలయం సమీపంలో ఆదివారం కడప నగరం ఎన్జీవో కాలనీకి చెందిన హేమవర్ధన్ అలియాస్ హేము అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం సోమవారం అతనిని సిద్దవటం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

సుండుపల్లె, జూలై14(ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వరకట్నం తీసుకురావాలని తన భర్త మరికొందరు వేధిస్తున్నారని రాయవరానికి చెందిన జనత్‌ఉన్నీసా ఫిర్యాదు చేయడతో రాయచోటికి చెందిన సయ్యద్ అజ్మత్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఐదేళ్ల క్రితం జనత్‌ఉన్నీసాకు, సయ్యద్ అజ్మత్‌కు వివాహమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

సుండుపల్లె, జూలై 14(ఆంధ్రజ్యోతి): నీటి విషయంలో జరిగిన గొడవకు సంబంధించి ఆరుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ జంగంపల్లికి చెందిన వీరనాగయ్య ఫిర్యాదు మేరకు రవి, రమణ, భద్రయ్యపైన, రవి ఫిర్యాదు మేరకు వీరనాగయ్య హనుమంతు, ఓ మహిళపై కేసు నమోదు చేశామన్నారు.

భర్త మోసం చేశాడని మహిళ ఆందోళన



మాట్లాడుతున్న ధనలక్ష్మి

బి.కొత్తకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భర్త మోసం చేశాడు. అత్తింటి వారు ఆదుకోలేదు.. పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదు.. నేనూ నాబిడ్డలు ఏమై పోవాలంటూ ఓ వివాహిత రోడ్డెక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ధనలక్ష్మి బి.కొత్తకోట పట్టణానికి చెందిన శివ నాగేంద్రను నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ మధ్య కాలంలో అతను ధనలక్ష్మిని నిర్లక్ష్యం చేస్తుండడంతో భర్త తల్లి సరస్వతిని పలుమార్లు ప్రశ్నించింది. సరైన సమాధానం రాకపోవడంతో బి.కొత్తకోట పోలీసులు, మదనపల్లె డీఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఫలితం లేకపోవడం తో సోమవారం బి.కొత్తకోటలోని బైపాస్ రోడ్డుపై బైఠాయించింది. విషయం తెలుసుకున్న సీఐ జీవన్ గంగనాథ్‌బాబు అక్కడికి చేరుకుని ధనలక్ష్మితో మాట్లాడారు. చుట్టు పక్కల నివాసమున్న జనం పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇంతకాలంగా మొరపెట్టుకున్నా తనకు, తన బిడ్డలకు న్యాయం చేయలేదని అందుకే రోడ్డు ఎక్కానని తెలిపింది. తనకు అన్యాయం చేసిన భర్త శివనాగేంద్ర, అతనికి సహకరిస్తున్న తల్లి సరస్వతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సుమారు రెండు గంటల పాటు ఈ నిరసన కార్యక్రమం కొనసాగింది. చివరకు చుట్టు పక్కల ఉన్న ప్రజలు, పోలీసులు న్యాయం చేస్తామంటూ స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు తీసుకున్నారు. మహిళకు న్యాయం చేస్తామని సీఐ తెలిపారు.

పేదలకు చేయూతకే పీ4

- బంగారు కుటుంబాలతో మార్గదర్శకులను జత చేయాలి
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి, తదితరులు

కలికిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు చేయూత ఇచ్చి వారు సంపన్నుల జాబితా లోకి రావడానికే సీఎం చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించారని కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలికిరిలో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మండల, గ్రామ స్థాయి అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో 11 వేల పేదల కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ బంగారు కుటుంబాలకు అండ గా నిలబడి ఆసరా కల్పించేందుకు మార్గదర్శులు ముందుకు రావాలని కోరారు. మార్గదర్శులను గుర్తించి వారికి కొన్ని బంగారు కుటుంబాలను అప్పగించి సమన్వయపరచడానికి అధికారులు కృషి చేయాల్సి ఉంటుందని చెప్పారు. మనమేమీ వారికి మన ఆస్తులు ఇవ్వాల్సిన పనిలేదు.. గుర్తించిన బంగారు కుటుంబాలను సరైన మార్గదర్శులకు అప్పగిస్తే చాలని సూచించారు. అనంతరం మార్గదర్శులు కూడా ఆ కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటూ వారు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న రంగాల వైపు వారిని ప్రోత్సహించాల్సి ఉంటుందన్నారు. తాను మళ్లీ మండల స్థాయి సమావేశాలు నిర్వహించి పీ4 పైన పురోగతి గురించి సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల ఉద్యోగులు, అధికారులు గౌరవప్రదంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తెలిపారు. పీఎం సూర్యఘర్ ద్వారా సోలార్ విద్యుదుత్పత్తికి ప్రజలంతా ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గం ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ పీలేరు ప్రాంతంలో టమోటా, మామిడి పండ్ల ఉత్పత్తి ఎక్కువగా ఉన్నందున ఇక్కడ పల్ప్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించాలని కోరారు. అదేవిధంగా పాడి పరిశ్రమ ప్రధాన జీవనాధారంగా ఉందని, డెయిరీల ఏర్పాటును ప్రోత్సహిస్తే సత్ఫలితాలుంటాయన్నారు. పీలే రు ఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సోలార్ విద్యుత్తుకు పరికరాలు ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేల వరకూ సబ్సిడీ లభిస్తుందని, విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదని తెలిపారు.

కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సచివాలయ ఉద్యోగు లు, ప్రజాప్రతినిధులు, మండల టీడీపీ అధ్యక్షుడు, అనుబంధ విభాగాల నాయకులు, బూ త్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండోల అధ్యక్షులు హాజరయ్యారు.

తొమ్మిదిమంది ఇంజనీర్లపై విచారణకు ఆదేశం

- 'భీమగుండం ఎత్తిపోతల'అక్రమాలపై ప్రభుత్వం చర్యలు

కలికిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కడప జలవనరుల శాఖలో గతంలో పనిచేసిన తొమ్మిది మంది ఇంజనీర్లపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 అక్టోబరు 28న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అందజేసిన నివేదికపై ఇంజనీర్ల నుంచి వివరణలు తీసుకున్న అనంతరం పూర్తి సమాచారం కోసం సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా పెద్దముడియం మండలంలో కుందూ నదిపై భీమగుండం ఎత్తిపోతల పథకం నిర్మాణం, దానికి ఇతరత్రా జరిగిన ఏర్పాట్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ గుర్తించింది. ఈ అక్రమాలకు తొమ్మిది మంది ఇంజినీర్లను బాధ్యులుగా తేల్చింది. అప్పట్లో దీన్ని పర్యవేక్షించిన హైదరాబాదు డిప్యూటీ చీఫ్ ఇంజినీరు (ఏపీఎస్ఐడీసీ) వై.భాస్కర్ రెడ్డి, ఏపీఎస్ఐడీసీ కడప డివిజన్ ఈఈ కె.ఎస్.డి. గౌడ్ (ప్రస్తుతం రిటైర్డు), కడప ప్రాజెక్టు ఆఫీసు డీఈఈ వి.సుధీర్ కృపానంద్, ఏఈఈఈ కె.కృష్ణ, కడప డివిజన్ క్యూసీ ఏఈఈ ఎ.హరిగోపాల్ (ప్రస్తుతం బనగానపల్లె డీఈఈ), డీఈఈ క్యూసీ డి.దినకర్ బాబు (రిటైర్డు), డీఈఈ క్యూసీ ఎస్.ఇక్బాల్ హుస్సేన్ (ప్రస్తుతం పులివెందుల జీఎస్ఎస్ఎస్ డీఈఈ), కడప క్యూసీ ఈఈ ఎ.ఉమేష్‌కుమార్ (ప్రస్తుతం విశాఖపట్నం ఈఈ), కడప క్యూసీ ఈఈ యు.రాజశేఖర్ (ప్రస్తుతం పులివెందుల పీబీసీ ఈఈ)లను బాధ్యులుగా నిర్ధారించారు. వీరు గతంలో సమర్పించిన సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో మరింత లోతుగా విచారణ చేయడానికి కడప (రాయలసీమ రీజియన్) క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీరు ఎం.కిరణ్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించారు. అక్రమాలకు సంబంధించిన అభియోగాలకు సంబంధించిన వివరాలు, బాధ్యులు సమర్పించిన సంజాయిషీలన్నింటినీ విచారణాధికారికి పంపుతున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. .

క్వాంటమ్ పెన్షన్ గోల్‌మాల్‌పై విచారణ



విచారణ చేస్తున్న ఎస్ఏవో బ్రహ్మయ్య తదితరులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లె, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో క్వాంటమ్ పెన్షన్ గోల్‌మాల్ వ్యవహారంపై ఆశాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్(ఎస్ఏవో) బ్రహ్మయ్య సోమవారం విచారణ చేశారు. ఫ్యామిలీ పెన్షన్‌లో గోల్‌మాల్.. వయసు పెంచి.. పెన్షన్ కాజేసి.. అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనా నికి స్పందించిన ఉన్నతాధికారులు శుక్రవారమే ఆరా తీశారు. సోమవారం అయిదుగురు సభ్యులతో కూడిన అధికారుల బృందం విచారణ ప్రారంభించింది. మదనపల్లె విద్యుత్ డివిజన్ పరిధిలో సాధారణ, క్వాంటమ్ పెన్షన్‌దారుల జాబితాపై ఆరా తీస్తున్నారు. ఇందులో మొత్తం 493 పెన్షన్‌దారులు ఉండగా, అందులో 292 మంది ఫ్యామిలీ క్వాంట మ్ పెన్షన్‌దారులు ఉన్నట్లు ఎస్ఏవో తెలిపారు. వీరికి ఎప్పటి నుంచి పెన్షన్ ఇస్తున్నారు.. క్వాంటమ్ అమలులోకి వచ్చి రివైజ్ అయిన 2022 నుంచి ఎంతమందికి ఇచ్చారు. పెన్షనర్ల వయస్సు ఎంత? ఎంత పెంచారు? ఎంత ఇచ్చారు. అదనంగా ఇచ్చిన సొమ్ములెంత? అందులో అరియర్స్ తదితర వివరాలపై ఆరా తీస్తున్నారు. అందుకు సంబంధించిన జాబితా, మంజూరు చేసిన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే విద్యుత్తుశాఖ డివిజన్ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్ విభాగం జూనియర్ అకౌంట్ ఆఫీసర్ పి.పార్వతి, జూనియర్ అసిస్టెంట్ గురుప్రసాద్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన ఫైళ్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పెన్షన్‌దారుల వివరాలు, ఫైళ్లను తనిఖీ చేయాల్సివుందని, పూర్తికావడానికి నాలుగురోజులు సమయం పడుతుందని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఎస్ఏవో బ్రహ్మయ్య వివరించారు. ఇందులో మదనపల్లె, రాయచోటి విద్యుత్తుశాఖ అధికారులు వెంకటేష్, సాయి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలకు రాయితీ

- జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి

రాయచోటి(కలెక్టరేట్), జూలై14(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు రైతులకు రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. పంటల కోత అనంతరం వాటిని గ్రేడింగ్, ప్యాకింగ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆమె తెలిపారు. దీంతో పాటు పండ్లు, పూలు, కూరగాయల పంటలకు బీమా కూడా కల్పిస్తుందని తెలిపారు. నీటి ఎద్దడి తట్టుకునేందుకు వీలుగా వ్యక్తిగత నీటికుంటల ఏర్పాటుకు 50 శాతం రాయితీతోపాటు, సామూహిక నీటికుంటలు తవ్వేందుకు అయ్యే ఖర్చులో 75 శాతం ఇస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం రాయచోటి హార్టికల్చర్ అధికారిని (9703814184) సంప్రదించాల్సిందిగా ఆమె తెలిపారు.

ఐటీఐ దరఖాస్తు గడువు పెంపు

పీలేరురూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ప్రభుత్వ ఐటీఐ)లో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 20వ తేదీ వరకు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.బాలమురళీప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండవ విడత ప్రవేశం కోసం దరఖాస్తు గడువు పెంచినట్లు చెప్పారు. ఈ నెల 20న సాయంత్రం లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 22 లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక



శ్వేత



మనోహర్

పెద్దతిప్పసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా శ్వేత, మనోహర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మండలంలోని నవాబుకోట గ్రామపంచాయతీ కార్యదర్శి శ్వేతను, ఉపాధ్యక్షుడిగా కందుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న జి.మనోహర్‌ను ఎన్నుకున్నారు.

మంత్రిపై అభ్యంతరకర పోస్టు పెట్టిన వ్యక్తి అరెస్టు



నిందితుడిని చూపుతున్న సీఐ

రాయచోటిటౌన్, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై అభ్యంతరకర పోస్టు పెట్టిన హైదరాబాద్‌కు చెందిన ఎరమాల అన్వేష్ రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ వెంకటాచలపతి తెలిపారు. ఈ నెల 12న ఫేస్ బుక్‌లో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖా మంత్రి మం డిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడిన వీడియోపై అభ్యంతరకర పోస్టు పెట్టిన అన్వేష్‌రెడ్డిపై మంత్రి పీఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన్ను అరెస్టు చేసి రాయచోటి అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపెట్టగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కర్నూలును కట్టడి చేసిన కడప బౌలర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని అనంత క్రీడాగ్రామంలో సోమవారం నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. తౌఫీక్ హుస్సేన్ (49), మురళి (40), ఇస్మాయిల్ (44), అంజనేయులు (31) ఫర్వాలేదని పించారు. కడప బౌలర్లు పఠాన్‌షరీఫ్ 4, అరీఫ్‌బాషా 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 23 ఓవర్లలో వికెట్ నష్టానికి 117 పరుగులు చేసింది. వంశీకృష్ణ అజేయ హాఫ్ సెంచరీ (77)తో కొనసాగుతున్నాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పెద్దపాపిరెడ్డి మృతదేహం

మైలవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, అనారోగ్య సమస్యల కారణంగా దన్నవాడ గ్రామానికి చెందిన పులిచెర్ల పెద్ద పాపిరెడ్డి (49) విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. పెద్ద పాపిరెడ్డికి వ్యవసాయంలో పంట దిగుబడి సక్రమంగా రాక అప్పులు ఎక్కువ కావడం, అనారోగ్య సమస్యలు పీడిస్తుండడంతో జమ్మలమడుగు-తాడిపత్రి బైపాస్‌రోడ్డు పక్కన ముళ్లపొదల వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పాపిరెడ్డి కొన్ని నెలలుగా జమ్మలమడుగులో నివాసం ఉంటున్నారు. మృతుని కుమారుడు మునిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

ప్రొద్దుటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు - బద్వేలు రోడ్డులోని జీవీ సత్రం వద్ద ప్రొద్దుటూరు ఫారెస్టు రేంజ్ అధికారులు ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. సోమవారం మైదుకూరు - బద్వేలు రహదారిలో జీవీ సత్రం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా.. ఒక వాహనంలో అనుమానస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వారిని



గాయపడిన ఎర్రచందనం స్మగ్లర్

వెంబడించగా ఒకరు పారిపోగా.. మరోవ్యక్తి కాలుకు గాయమై పట్టుబడ్డాడు. అతన్ని ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కాలుకు ఫ్యాక్చర్ అయినట్లు వైద్యులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రొద్దుటూరు ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీకు మారి మాట్లాడుతూ పట్టుపడ్డ వ్యక్తి వనిపెంటకు చెందిన పాత ఎర్ర చందనం స్మగ్లర్ నాగేంద్ర అని.. అతనిపై ప్రొద్దుటూరు రేంజ్ పరిధిలో పలు కేసులు ఉన్నాయన్నారు. అతను తాడిపత్రికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డితో కలసి మల్లేపల్లె ఏరియాలో వున్న ఎర్రచందనం దుంగలను తీసుకువెళ్లడానికి వచ్చారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రెండో గాంధీ బొమ్మ వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తికి ఫిట్స్ రావడంతో కింద పడిపోయినట్లు వన్ టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి 62 సంవత్సరాల వయసు ఉంటుందని, ఇతర వివరాలకు 9121100510, 9121100511 నెంబర్లకు ఫోను చేసి తెలుసుకోవాలని కోరారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లి బిడ్డలు అదృశ్యం



అదృశ్యం అయిన యమున, పిల్లలు

కడప క్రైం జులై 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎన్‌జీఓ కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన నివాసం ఉంటున్న పోకూరు యమున (30) తన ఇద్దరి బిడ్డలతో కలిసి అదృశ్యం అయినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు... యమున భర్త పోకూరు సురేష్ కుమార్, పిల్లలు సిందూరి, కుసుమాంజలితో గత నెల 23న ఇంట్లో పడుకొని నిద్రపోయారు. 24వ తేదీ ఉదయం యమున ఇద్దరు పిల్లలను తీసుకొని అదృశ్యం అయినట్లు తెలిపారు. బంధువులు ఇళ్లలో వెతికినప్పటికీ ఆమె ఆచూకి తెలియకపోవడంతో భర్త సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అదృశ్యం అయిన వారు ఎక్కడైనా కనిపిస్తే 9121100520, 9121100521, 9121100522 ఫోన్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎరువుల ధరలు తగ్గించాలి

● అదాని స్మార్ట్ మీటర్లు వద్దు : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రసాయన ఎరువుల ధరలు అమాంతంగా పెంచడం అన్యాయం, దుర్మార్గమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికారి ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. 50 కేజీల పొటాష్‌పై రూ.265, 10:26:26 బస్తాపై రూ.330, 12:32:16 బస్తాపై రూ.250 పెరిగాయని పేర్కొన్నారు. ఒకవైపు వర్షాలు పడక, గిట్టుబాటు ధర లభించక, అన్నదాత సుఖీభవ పథకం అమలు కాక రైతులు లబోదిబోమంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పెంచిన రసాయన ఎరువుల ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్‌స్మార్ట్ మీటర్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం రెండు నాల్కల ధోరణి ప్రదర్శించడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను జగన్ ప్రభుత్వం బిగిస్తే అడ్డుకోండి, పగులగొట్టండి అని టీడీపీ, జనసేన నాయకులు ప్రజలకు చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రభుత్వమే స్మార్ట్ మీటర్లు బిగించడం గర్హనీయమని తెలిపారు.



సర్వే నెంబరు 17లో ధ్వంసమైన చెక్‌డ్యామ్, సర్వే నెంబరు 628లో ఆక్రమణకు గురైన చెక్‌డ్యామ్

చెక్ డ్యాములను వదలని అక్రమార్కులు

● ధ్వసం చేసి వైసీపీ నేతల ఆక్రమణ

● తుమ్మలూరు రెవెన్యూ గ్రామ పరిధిలో ఈ తతంగం

పెండ్లిమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నీటి ఎద్దడి నివారణకు ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టి సస్యశ్యామలం చేసేందుకు వాగులు, వంకల ద్వారా ప్రవహించే నీటికి అడ్డుకట్ట వేసి వృథాకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వాలు నీరుచెట్టు, జలయజ్ఞం లాంటి కార్యక్రమాల ద్వారా చెక్‌డ్యాములను నిర్మించారు. ఈ చెక్ డ్యాముల ఏర్పాటు వల్ల భూగర్భ జలాల నీటిమట్టం పెరగడంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో నీటి లభ్యత పెరుగుతుంది. తెలుగుదేశం ప్రభుత్వం నీరుచెట్టు ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టింది. వాగులు, వంకల్లో పూడిక తీత పనులు, కందకాల ఏర్పాటు, ట్రెంచ్‌లు, చెక్‌డ్యాములు నిర్మించింది. అయితే కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లు ఎంతో గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాములను వదలకుండా ధ్వంసం చేసి ఆక్రమించడం వైసీపీ నేతలకే చెల్లు. తుమ్మలూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 17, 628, 152, 38, 574 సర్వే నెంబర్లలో కొన్ని సంవత్సరాల క్రితం మూగ జీవాల తాగునీటి కోసం, ఆ చుట్టు ప్రక్కల భూగర్భ జలాలను పెంచేందుకు చెక్‌డ్యాములను నిర్మించారు. అయితే ఈ చెక్‌డ్యాములను గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ధ్వంసం చేసి ఆక్రమించేసి అక్కడ బోర్లు వేసుకుని భూములు సాగు చేస్తున్నారు. నీరు చెట్టు కింద చేసిన పనులకు గత వైసీపీ ప్రభుత్వం విజిలెన్స్ విచారణ పేరుతో బిల్లులు నిలబెట్టారు. ఏడాది క్రితం ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ఆ బిల్లులను చెల్లించింది. ఈ చుట్టు పక్కల పొలాలు ఉన్న రైతులు గతంలో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండేదని మళ్లీ వాటర్‌షెడ్ల కింద చెక్‌డ్యాములను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రూ.14లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

● వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీ ● రిటైల్ దుకాణంలో అనధికారిక గోడౌన్‌బయటపడిన వైనం

ప్రొద్దుటూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం కర్నూలు, తిరుపతికి చెందిన వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా స్థానిక అధికారులతో కలిసి సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మి హోల్ సేల్, రీటైల్ ఫర్టిలైజర్స్ దుకాణంలో కర్నూలుకు చెందిన డీఆర్‌సీ కేంద్ర ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు, తిరుపతి విజిలెన్స్ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, కడప డీఏవో కార్యాలయ టెక్నికల్ ఏవో ఎస్.గోవర్ధన్, ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖాధికారి ఎస్.వరాహరికుమార్‌లు కలిసి పలు రికార్డులను తనిఖీ చేశారు. దుకాణ నిర్వాహకులు అధిక మొత్తంలో స్టాకును ఉంచి అనధికారిక గోడౌన్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. స్టాకు వివరాలను పరిశీలించి రూ.14లక్షలు విలువచేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. నియమ నిబంధనల ప్రకారం గోడౌన్‌ను ఏర్పాటు చేసుకుని అనుమతులు పొందిన తర్వాత ఈ స్టాకును అక్కడికి తరలించి తదుపరి అమ్మకాలకు అధికారులు ఆదేశాలు జారీ చేయనున్నారని ఏవో తెలిపారు.



మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బాలాయపల్లెలో సమస్యలపై ఆర్డీవో ఆరా

కాశినాయన జూలై 14(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని బాలాయపల్లెలో సోమవారం బద్వేల్ ఆర్డీవో చంద్రమౌళి పర్యటించి తాగు, సాగునీటి సమస్యలపై ఆరా తీశారు. ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బాలాయపల్లెకు వచ్చిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త రితీష్‌రెడ్డిలకు గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, తెలుగంగ నీటిని ఎత్తిపోతల ద్వారా బాలాయపల్లె చెరువుకు అందించాలని, అంగన్వాడీ భవనం అన్యాక్రాంతమైందని, గతంలో మంజూరైన మా గ్రామ సచివాలయాన్ని వేరొక మండలానికి మార్చారని గ్రామస్తులు ఏకరువు పెట్టారు. సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఈవిషయాలన్నింటిని మంత్రి గొట్టిపాటి వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకపోయారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో చంద్రమౌళి సోమవారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో, స్థానిక అధికారులు సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బోర్లు ఎన్ని ఉన్నాయి.. వాటిలో నీటిలభ్యత ఏవిధంగా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న బోరును పరిశీలించి వాడుకలోకి తేవాలని ఆదేశించారు. బాలాయపల్లె చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీరు అందించే విషయంపై క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యా సాధ్యాలపై చర్చించారు.. అనంతరం గొంటువారిపల్లె గ్రామ సచివాలయంలో అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై గ్రామసమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఈవోపీఆర్డీ ముజఫర్ రహీమ్, డీఈ అబ్దుల్ ఖాదర్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఏఈలు బాలపుల్లయ్య, ఓబయ్య, టీడీపీ నాయకులు డి.క్రిష్ణారెడ్డి, జయరామిరెడ్డి, పి.పోలిరెడ్డి, నాయనపల్లె రమణారెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



బాలాయపల్లెలో తాగునీటి బోరును పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమౌళి

హైవపర్ విద్యుత్తు లైన్‌ను అడ్డుకున్న రైతులు

సీకేదిన్నె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌వారు అనంతపురం నుంచి కడపకు తీసుకొస్తున్న 400 కేవీ హైటెన్షన్ విద్యుత్తు టవర్ నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. చింతకొమ్మదిన్నె చెరువులో సోమవారం హైటెన్షన్ టవర్ నిర్మాణం జరుగుతున్న విషయం తెలుసుకున్న మండలంలోని లింగారెడ్డిపల్లె, దవలాన్‌పురం, పడిగెలపల్లి, బుగ్గలేటిపల్లి జమాల్‌పల్లి, తదితర గ్రామాల రైతులు అక్కడకు చేరుకుని అధికారులను ముట్టడించి టవర్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణపు డిజైన్‌లో లోపాలు ఉన్నాయని, వాటిని సవరించకుండా అధికారులు ఇష్టం వచ్చినట్లు టవర్లు వేస్తే తమకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణం ద్వారా కడప-రాయచోటి జాతీయ రహదారికి సమాంతరంగా దాదాపు నాలుగైదు కిలోమీటర్లు లైన్ వెళుతుందన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులతోపాటు రెండు జిల్లాలకు కనెక్టివిటి అధికంగా ఉందని, రాబోవు కాలంలో అభివృద్ధికి విద్యుత్తు టవర్లు ఆటంకంగా మారుతాయన్నారు. జాతీయ రహదారికి సమాంతరంగా విద్యుత్తు లైన్ వెళ్లడం ద్వారా తాము ఎంతో విలువైన పొలాలను కోల్పోతామన్నారు. పవర్‌గ్రిడ్ అధికారులు అనంతపురం, గుత్తి, కడప కార్యాలయాలను సంప్రదించి అర్జీలు సమర్పించినప్పటికీ ఎటువంటి మార్పులు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంవత్సరం క్రితమే జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ నందు ఫిర్యాదు చేశామన్నారు. పక్కా వ్యాపార సంస్థ అయిన పవర్‌గ్రిడ్ కడప-రాయచోటి జాతీయ రహదారి వెంబడి పొలాల మీదుగా డిజైన్లు తయారు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కడప ఆర్డీవో, చింతకొమ్మదిన్నె తహసీల్దారుకు రైతులు సమస్య వివరించడంతో లైన్లు పక్కకు మార్చి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత డిజైన్ ప్రకారమే తిరిగి నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టడంపై రైతులు ఆందోళన చేపట్టి టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఇప్పటికైనా పవర్‌గ్రిడ్ అధికారులు తమ డిజైన్లు మార్చుకుని ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.



చింతకొమ్మదిన్నె చెరువులో నిర్మిస్తున్న హైపవర్ టవర్ల నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు

ఉత్సాహంగా సాగిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి అండర్-11, అండర్-13 బ్యాడ్మింటన్ ఎంపికలు సోమవారం జార్జ్‌కారోనేషనల్ క్లబ్‌లో ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా 200 మంది బాలబాలికలు పాల్గొనగా సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీలు నిర్వహించి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, జార్జిక్లబ్ కార్యదర్శి సుధాకర్ తెలిపారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అండర్-11 బాలికల విభాగంలో డి.ప్రణవి, సత్యరాయ్, తారావాకింగ్స్ (కడప), అండర్-13 బాలికల విభాగంలో డి.ప్రణవి, ఎం.అక్షర (కడప), నిహతిరెడ్డి, తారికారెడ్డి (ప్రొద్దుటూరు) ఎంపికయ్యారు. అండర్-11 బాలుర విభాగంలో పీబీజీ గౌతమ్, ఎస్‌వీ సాత్విక్‌రెడ్డి, హవీష్ (ప్రొద్దుటూరు), అండర్-13 బాలుర విభాగంలో ఎ.త్రిషాల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పీబీజీగౌతమ్ (ప్రొద్దుటూరు) ఎంపికయ్యారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బాలనాగయ్య, టోనీశ్యామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ప్రతి ఎకరాకు నీటిని అందిస్తాం : పుట్టా



రాజోలి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టు కింద చివరి ఎకరాకు నీటిని అందిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. రాజుపాలెం మండలంలోని రాజోలి జలాశయం నుంచి సోమవారం కేసీ మెయిన్ కెనాల్‌కు ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కేసీ కెనాల్ ఆయకట్టును పట్టించుకొన్న పాపాన పోలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కేసీ కెనాల్ మరమ్మత్తుల కోసం రూ.కోటి 60 లక్షలు మంజూరు చేసిందన్నారు. అలగనూరు రిజర్వాయర్‌లో ఆనకట్ట పనులను పూర్తి చేసి కేసీ ఆయకట్టు కింద రైతులు ఏడాదికి రెండు కార్లు పంటలను పండించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, నంద్యాల రాఘువరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, పొలిమేర శివశంకర్‌రెడ్డి, బొరెడ్డి రమణారెడ్డి, అన్నవరం సుధాకర్‌రెడ్డి, తుపాకుల రమణ, బండి అమర్‌నాథ్, కేసీ కెనాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మా కుమార్తె వివాహానికి రండి

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గోవర్ధన్‌రెడ్డి ఆహ్వానం



ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వానపత్రిక ఇస్తున్న గోవర్ధన్‌రెడ్డి దంపతులు

కడప ఎర్రముక్కపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోత): మా కుమార్తె వివాహానికి వచ్చి ఆశీర్వదించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడును కలిసి తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వివాహానికి హాజరు కావాలని కోరారు. ఆగస్టు 14వ తేదీ తిరుమలలో వివాహం, ఆగస్టు 24న కడప నగరంలోని మాధవి కన్వెన్షన్‌లో రిసెప్షన్ జరుగుతుందని ముఖ్యమంత్రికి తెలిపారు. ఇందుకు చంద్రబాబునాయుడు రిసెప్షన్‌కు వస్తానని తెలిపారని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రొద్దుటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అటువంటి స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సబ్ డిస్ట్రిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ గీత మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించాలంటే లింగనిర్ధారణ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, కమిటీ సభ్యులు గైనకాలజిస్టు డాక్టర్ యశ్వస్విని, డాక్టర్ కిరణ్, రేడియాలజిస్ట్ డాక్టర్ గోపాల్, శ్రీదేవి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ప్రస్తుతం విశాఖపట్నం, సీతంపేట, రాజేంద్రనగర్ పవన్ విహార్ ఫ్లాట్ నెం. బి2, డోర్ నెం. 50-13-63/2 నివాసి అయిన తొట్లి నీలకంతా రెడ్డి గారు తరపున ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా.

మజర అన్నగారి పల్లి నివాసి కీర్తిశేషులు తొట్లి వెంకట రెడ్డి గారికి 4 గురు సంతానము వారు. 1) తొట్లి కృష్ణారెడ్డి, 2) తొట్లి జయరామిరెడ్డి, 3) (లేటు) తొట్లి చంద్రశేఖర్ రెడ్డి, 4) తొట్లి రఘునాదరెడ్డి అయి ఉన్నారు. నా క్లయింటు అయిన తొట్లి నీలకంతా రెడ్డి గారు కీర్తిశేషులైన తొట్లి చంద్రశేఖర్ రెడ్డి గారికి ఎకైక మగ సంతానం అయినందున ఈ ప్రకటన దాఖలా ఆస్తి తొట్లి నీలకంతా రెడ్డి గారికి వారసత్వరీత్యా సంక్రమించినది. అనగా తాతగారు అయిన లేటు తొట్లి వెంకటరెడ్డి గారి ద్వారా సంక్రమించినది చిత్తూరు జిల్లా (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా) తంబల్లపల్లె తాలూకా మరియు తంబల్లపల్లి మండలం వాస్తవ్యులు అయిన (లేటు) తొట్లి వెంకట రెడ్డి గారి ద్వార దఖలు పడిన ఈ ప్రకటన ఆస్తిలో నా క్లయింటుకు 1/4 వంతు హక్కు అనుభవం కలిగి ఉన్నారు.

నా క్లయింటు తొట్లి నీలకంఠరెడ్డి గారి తండ్రి అయిన (లేటు) తొట్లి చంద్రశేఖర్ రెడ్డి గారు 1999వ సంవత్సరములో మరణించిన తదుపరి పెదనాన్న గారు అయిన తొట్లి జయరామిరెడ్డి గారు దురాశతో నా క్లయింట్ భూమిని దురుద్దేశముతో ఆక్రమించుయత్నంతో నా క్లయింటు తల్లి గారు మరియు ఇరువురి ఆడపిల్లలకు మాయ మాటలు చెప్పి నా క్లయింటు తొట్లి నీలకంఠారెడ్డి గారికి తెలియకుండా 2007వ సంవత్సరములో విక్రయ దస్తావేజు తేదీ 26-12-2007 నెంబరు 763/2007, సబ్‌రిజిస్ట్రార్ తంబల్లపల్లె చిత్తూరు డిస్ట్రిక్ట్ (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా)లో రిజిస్టర్ చేయించుకున్న విషయాన్ని నా క్లయింట్ తొట్లి నీలకంఠారెడ్డి గారికి సుమారు రెండు నెలల క్రిందట అనగా మే నెల 2025లో అతని తల్లి గారు అయిన లేటు తొట్లి చంద్రశేఖర్ రెడ్డి గారి భార్య తొట్లి విమలమ్మ గారు తెలియపరిచినారు.

తదుపరి నా క్లయింటు అయిన తొట్లి నీలకంతా రెడ్డి గారు విచారణ జరపగా, పెద్దనాన్న గారు అయిన తొట్లి జయరామిరెడ్డి గారు మరియు తొట్లి కృష్ణారెడ్డి గారు కుమారుడు అయిన తొట్లి కిరణ్ కుమార్ రెడ్డి గారు ఇరువురు కలిసి చట్టవ్యతిరేకముగా పైన ఉదహరించిన విక్రయ దస్తావేజుద్వారా దౌర్జన్యంగా వ్రాయించుకుని తిరిగి సమాజములో విక్రయించుటకు ప్రయత్నములు జరుగు చున్నదని తెలిసినది మరియు మరియొక అసామి అయిన తొట్లి జయరామిరెడ్డి గారు రెండవ కుమార్తె వై.కవితారెడ్డి అను ఆమె కూడా చట్టవ్యతిరేకముగా షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు ప్రయత్నము చేయుచున్నారని తెలిసినది.

ఇందు మూలముగా ప్రజలు యావన్మందికి తెలియచేయునది ఏమనగా పైన ఉదహరించిన ఆసాములతో మా క్లయింటు అయిన శ్రీ తొట్లి నీలకంతా రెడ్డికి సంబంధించిన షెడ్యూల్డ్ ఆస్తితో ఏ విధమైన వ్యవహారములు / లావాదేవీలు చేసిన ఎడల అవి చట్ట ప్రకారం చెల్లనేరవు మరియు ఎటువంటి లావాదేవీలు కాని వ్యవహారములు కాని జరిపిన అటువంటి వాటితో మా క్లయింటు అయిన శ్రీ తొట్లి నీలకంఠారెడ్డికి ఎటువంటి సంబందము లేదని తెలియజేయడమైనది. ఈ ప్రకటనకు సంబంధించి ఎటువంటి అభ్యంతరములు / ఆక్షేపములు ఎమైన ఉన్నెడల ఈ ప్రకటన వెలువడిన తేదీనుండి 15 (పదిహేను) దినముల లోపు ఈక్రింది చిరునామా వారికి వ్రాతపూర్వకముగా సమర్పించవలసినదిగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ :

Item No. I : Land situated at Annamayya District (Earlier called as Chittor District), Thambellapalle Sub Registrar Office, Thambellapalle Mandalam, Kotla Palle Garmam, Majara Annagaripalli, Having Patta Dar Pass Book No. CTR 30191, S.No. 196 to an extent of Ac. 2.00 Cents or 0.809 Hectors.

Item No. II : Land Situated at Annamayya District (Earlier called as Chittor District), Thambellapalle Sub Registrar Office, Thambellapalle Mandalam, Diguvapalem Panchayathi, Majara Annagaripalli Village, having Patta Dar Pass Book No. CTR 30172, Survey No's as follows : S.No. - 29 Total 03.54 Cents - Ac. 02.64 Cents 1.06 Hectors, S.No. - 51/1A Total 06.36 Cents - Ac. 01.43 Cents 0.57 Hectors, S.No. - 145/2A Total 00.35 Cents - Ac. 00.05 Cents 0.020 Hectors, S.No. 145/3B Total 00.81 Cents - Ac. 00.05 Cents 0.020 Hectors, S.No. 145/4B Total 00.79 Cents - Ac.00.05 Cents 0.020 hectors, S.No. 145/6B Total 00.04 Cents - Ac. 00.04 Cents 0.010 Hectors, S.No.-36/1 Total 02.34 Cents - Ac.00.36 Cents 0.145 Hectors, S.No. 325 total 01.60 Cents - Ac. 00.25 Cents 0.100 hectors, S.No. 332 total 02.85 Cents - Ac. 00.48 Cents 0.194 Hectors, S.No. - 321 Total 02.69 Cents - Ac. 00.40 Cents 0.162 Hectors, S.No. 320/1 Total 02.13 Cents - Ac ./ 00.10 Cents 0.040 Hectors, S.No. 318/1 Total 01.13 Cents - Ac. 00.11 Cents 0.040 Hectors, S.No. 127/2 total 01.26 Cents - Ac. 00.15 Cents 0.060 Hectors

V.V.NARSIMHAM, M.Com., B.L., Advocate
Flat No. 301, 8-46-1, Surya Bhavan Apartments, Vidyanagar Colony, China Waltair Road, Old CBI Office Down, Visakhapatnam - 3, Ph : 7337375015

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవంపై ఏర్పాటు చేసి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి , అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకీ ఉత్సవం అనంతరం అర్చకులు పల్లకీ ఉత్సవ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పునరుద్ధరణ చర్యలతో.. మామిడిలో మంచి దిగుబడులు

● ఉద్యానవన శాఖ అధికారిణి సింధూరి



మామిడి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి సింధూరి

లక్కిరెడ్డిపల్లె, జూలై14 (ఆంధ్రజ్యోతి):కోతల అనంతరం ముదురు మామిడి తోటల్లో పునరుద్ధరణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానశాఖ అధికారి సింధూరి తెలిపారు. సోమవారం మద్దిరేవుల పంచాయతీ రెడ్డివారిపల్లెలో మామిడి తోటలను పరిశీలించి, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాదికోసారి మాత్రమే దిగుబడినిచ్చే మామిడిలో మంచి దిగుబడులు పొందాలంటే.. కాయలు కోసినప్పటి నుంచి తోటల్లో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందులో చెట్ల ఆకారం నిర్వహణ, తలమార్పిడి, పునరుద్ధరణ చర్యలు ముఖ్యమైనవన్నారు. ముదురు తోటల్లో కొమ్మలు బాగా పెరిగి కలిసిపోవడం వల్ల సూర్యరశ్మి సోకక చీడపీడలు పెరిగి దిగుబడులు నాణ్యత తగ్గుతాయన్నారు. కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్టుకు విశ్రాంతినివ్వాలన్నారు. జూలై 14 నుంచి ఆగస్టు 15 లోపల కత్తిరింపులు చేయాలన్నారు. అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, ఎండిన కొమ్మలు పూర్తిగా తొలగించాలన్నారు. గుబురుగా పెరిగిన చెట్లల్లో సూర్యరశ్మి, గాలి లోపలికి ప్రసరించేలా తలపైన కొమ్మలను కత్తిరించాలన్నారు. అవసరమైతే తూర్పు, పడమర దిక్కుల్లో కూడా కొమ్మలను కత్తిరించి గుబురుగా లేకుండా చేయాలని తెలిపారు. ఎండిన పూత కాడల ద్వారా ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉంది కనుక వీటిని వర్షాకాలం రాకముందే తొలగించాలన్నారు. బంగినపల్లి, నీలం రకాల్లో ప్రతి ఏటా కొమ్మలను కత్తిరించి చెట్లపై నలువైపులా కాంతి, గాలి సోకేలా చేయడం చాలా అవసరం అని వివరించారు. కత్తిరింపులు చేసిన వెంటనే పెద్ద కొమ్మల భాగానికి 10 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఆరు గ్రాముల కార్బరిల్ లీటర్ నీటికి చొప్పున కలిపిన ద్రావణం పూయాలన్నారు. లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి చెట్టు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలన్నారు. అవసరం మేరకు నాటు రకాలు నాణ్యతలేని రకాల, దిగుబడి ఇవ్వని చెట్లను తల మార్పిడి విధానంలో లాభసాటి రకాలుగా మార్చుకోవాలన్నారు.

నీటి వసతి కలిగిన తోటల్లో ఒక చెట్టుకు ఒక కిలోయూరియా, ఐదు కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 750 గ్రాముల మ్యురేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి వీహెచ్‌ఏ లావణ్య, గ్రామ రైతులు శ్రీనివాసులు, హరినాథరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భుజంగేశ్వరుడికి అభిషేక పూజలు

రైల్వేకోడూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు సోమవారం అర్చకుడు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ అభిషేక పూజలు నిర్వహించారు. భుజంగేశ్వరుడు, భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సచివాలయాల పోలీసులు బదిలీ

సిద్దవటం, జూలై 14 (ఆంధ్రజ్యోతి):బదిలీల నేపథ్యంలో గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు సోమవారం రిలీవ్ అయ్యారు. మండలంలోని బొగిడివారిపల్లె, మాధవరం, మాచుపల్లె, భాకరాపేట, టక్కోలి గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సుభద్ర, సుధారాణి, దివిజ, వనజాక్షి, శ్రీలత ఒంటిమిట్ట, కడప, చింతకొమ్మదిన్నె మండలాలకు బదిలీపై వెళ్లారని ఎస్‌ఐ వివరించారు.

ఎంసెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థినులతో అధ్యాపక బృందం

నందలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు సోమవారం సాయంత్రం ఎంసెట్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రధానాచార్యులు గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గంగనపల్లె వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ మెటీరియల్‌ను వినియోగించుకోవాలన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

రాజంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రాజంపేట పట్టణంలో అన్నదానం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యుడు సయ్యద్ నాసరుద్దీన్ ఆయన తండ్రి జ్ఞాపకార్థం పేదలకు బిర్యానీతో కూడిన అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, క్లబ్‌కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రాయచోటిటౌన్, జూలై14(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ తరపున కల్యాణ దుర్గం నుంచి వచ్చిన ఏడీఏ యల్లప్ప, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తరపున సీఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి ఎరువులు, పురుగు మందులు, విత్తనం షాపులను తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఎరువులు గానీ, పురుగులు మందులు గానీ, విత్తనాలు గానీ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే రైతులకు రసీదులను తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో ఎక్కడా ఎరువులు కొరత రాకుండా చూసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయ కార్యాలయ వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరుకున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



రాయచోటి: మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొన్న ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై14(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీలో పనిచేస్తున్న తాగునీరు, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరుకుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపట్టారు.మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్షలో పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బవరం రామాంజులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 36 జీవోను అమలు చేసి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 16వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికులు కూడా సమ్మె బాట పట్టనున్నారన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, గౌరవాధ్యక్షుడు వై. శంకరయ్య, ఇంజనీర్ సెక్షన్ అధ్యక్షుడు అక్బర్‌అలీఖాన్, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎం.చెన్నయ్య, కోశాధికారి రాంబాబు, ఇంజనీరింగ్ సెక్షన్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కార్మికుల సమ్మె

రాజంపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలపై మున్సిపల్ కార్మికులు ఈనెల 16న సమ్మె చేయాలని నిర్ణయించినట్లు రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి, ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి సుపరిపాలన: చమర్తి



సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నాయకులు

రాజంపేట,జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం ఊటుకూరులో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికి తల్లికి వందనం కింద రూ.13 వేలు అందజేశామన్నారు. అలాగే యేడాదికి దీపం పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద వృద్ధులకు రూ. 4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ, కాలేయం, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, పూర్తిగా అంగవైకల్యం ఉన్నవారికి 15 వేలు ఇస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇలా కూటమి ప్రభు త్వం పలు సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళుతున్నామన్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, రాజంపేట మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్ రాజు, దొంతం శివకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లి రెడ్డయ్య, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎన్వీ రమ ణ, ఊటుకూరు నీటిసంఘం చైర్మన్ హరినాథ్, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, చెంగల్‌రాయుడు, సుబ్రమణ్యంరాజు, మలిశెట్టి సుబ్బరాయుడు, కొండయ్యరాజు, కేఎస్ నరసింహా, కళాధర్, ఉద్దండపు సుధాకర్, కోవూరు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ

సిద్దవటం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, కోటకు వెళ్లే రహదారిలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. ఈ మేరకు సోమవారం దండోరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రివేళల్లో రహదారికి అడ్డంగా గోవులు ఉంటున్నాయని, వాహనాలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. గోవుల యజమానులు రోడ్లపైకి రాకుండా చూడాలన్నారు. పెన్నానదికి వరదనీరు ఎక్కువగా వస్తున్నాయని, నది వద్దకు ఎవరూ వెళ్లవద్దన్నారు. కొత్తవ్యక్తులు ఎవరైనా పెన్నానది వద్ద ఉంటే వెంటనే సమాచారం తెలపాలన్నారు.

స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం : ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్‌రఫి మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వారి కుటుంబం దిక్కులేనిది అవుతుందని తెలిపారు. లేకుంటే జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాబయ్య, రైటర్ రాముడు, స్థానిక పోలీసులు జగదేవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కోసం రాజీలేని పోరాటం



నూతన కమిటీ ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న నరసింహులు

సుండుపల్లె, జూలై14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమానికి ఏపీయూఎస్ రాజీలేని పోరాటం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. సోమవారం సుండుపల్లె మండల కేంద్రంలో ఏపీయూఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న ట్లు తెలిపారు. ఉపాధ్యాయుల తరపున రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. సుండుపల్లె మండల అధ్యక్షుడిగా రవీంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శిగా నారాయణనాయక్, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా రాంమోహన్, కార్యదర్శిగా మధుసూదన్‌రావు, మహిళా కన్వీనర్‌గా మునీశ్వరమ్మ, క్రీడా కన్వీనర్‌గా రాధారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన రవీంద్రనాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బదిలీల్లో అనేక మంది ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు రాక జీతాల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తాళ్లపాకలో ఘనంగా వసంతోత్సవం



తాళ్లపాకలో జరిగిన చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామివార్ల వసంతోత్సవం

రాజంపేట, జూలై 14 (ఆంధ్ర జ్యోతి):తాళ్లపాకలో బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నకేశవ, సిద్దేశ్వర స్వామి మూల వరులను పురవీధుల్లో ఊరేగించి వసంతోత్సం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఆడిటర్ పంత్, పట్టుపోగుల ఆదినారాయణ, తాళ్లపాక గ్రామ ప్రజలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నిత్యపూజ కోనకు భక్తుల రద్దీ

సిద్దవటం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యపూజకోనకు సోమవారం భక్తుల రద్దీ పెరగడంతో ఎండోమెంట్‌శాఖ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. సన్నిదానం క్యూలైనులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోప్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకుడు సుబ్రమణ్యంశర్మ మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం ఉమ్మడి కడప జిల్లాలోని పలు మండలాలకు చెందిన భక్తులు పాల్గొన్నారని, స్వామివారికి గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకాల, వంటి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

'ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి'

రైల్వేకోడూరు రూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించుకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టి తగు చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్సూర్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలతో వేల రూపాయల వ్యాపారం చేస్తున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి: కేవీపీఎస్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఇందిరమ్మ కాలనీవాసులు

రాయచోటి (కలెక్టరేట్), జూలై14(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కోకన్వీనర్ డీసీ వెంకటయ్య అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఇందిరమ్మ కాలనీవాసుల దాహార్తి తీర్చాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో సుమారు 700 కుటుంబాలు, 3 వేల జనాభా ఉన్నారని, ప్రతిరోజు ఇక్కడ నుంచి ఉపాధికి వెళ్లి జీవనం చేసుకునేవారని, ఇప్పుడు పనులు మానుకొని నీటి కోసమే ఎదురు చూస్తున్నారన్నారు.

పొలాలకు వెళ్లేదారి సమస్యకు పరిష్కారం చూపండి

రాజంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెనగలూరు ఎస్టీ కాలనీకి ఎగువ వైపున పొలాల్లోకి వెళ్లకుండా కొంతమంది దారికి అడ్డు తగులుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బీసీ సంఘ నేతలు అర్జీ అందజేశారు. సర్వేనంబరు 23/3లో 3.32 ఎకరాల భూమిలో మాజీ తహసీల్దారు తురక రామచంద్రయ్యకు దారి కల్పించారు. అయితే ఇటీవల కాలంలో కొంతమంది రైతులు దిగువనున్న రైతులను వారి పొలాలకు వెళ్లకుండా ఇబ్బందులు కలగుజేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఏపీ బీసీ సంక్షేమ వడ్డెర రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరబాస్కర్ తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల గంగాధర్, సభ్యులు అలకుంట్ల సుబ్బరాయుడు, బత్తుల గంగాధర్ పాల్గొన్నారు.


నిరుద్యోగ భృతి చెల్లించాలి: ఏఐవైఎఫ్

రైల్వేకోడూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి చెల్లించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ కోరారు. సోమవారం రెవెన్యూ శాఖ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మానసకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇవ్వకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

సంఘాలకు సమావేశాలే కీలకం

వీరబల్లి,జూలై14(ఆంధ్రజ్యోతి): సంఘాలకు సమావేశాలే కీలకమని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. సోమవారం పెద్దివీడు పాత పంచాయతీ భవనంలో జరిగిన పెద్దివీడు గ్రామ సమాఖ్య-3 జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సమావేశాలు లేని సంఘాలకు భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయన్నారు.

ఉసూరుమనిపించిన నైరుతి



పీటీఎం మండలం కందుకూరు వద్ద దుక్కులు దున్ని బీళ్లుగా వదిలేసిన చేను

- వేరుశనగ సాగుకు ముగిసిన అదును
- మూడేళ్లతో పోలిస్తే అతి తక్కువ వర్షపాతం
- గృహోపయోగానికే సబ్సిడీ విత్తనం

నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ మొదటి వారంలోనే వర్షాలు విస్తారంగా కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనలతో రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేసింది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్‌లో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. రైతులు చేసేది లేక సబ్సిడీ ధరలతో కొనుగోలు చేసిన విత్తనాలను చట్నీలకు వాడుకుంటున్నారు

మదనపల్లె టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే మే నెల నుంచి కురిసే వర్షాలపైనే జిల్లాలో వేరుశనగ పంట సాగు ఆధారపడి ఉంటుంది. మే, జూన్ నెలల్లో కురిసే వర్షానికి రైతులు దుక్కులు దున్ని, వేరుశనగ విత్తనాలు ఒబ్బిడి చేసుకుని, పొలంలో విత్తుతారు. మూడు నెలల కాలంలో కురిసే వర్షాలకు అనుగుణంగా, వేరుశనగ పంట రైతు చేతికి వస్తుంది. గత మూడేళ్లుగా నైరుతి రుతుపవనాలు వేరుశనగ సాగుకు అనుకూలించలేదు. ఈ ఏడాది మే నెలలో కూడా అంతంత మాత్రంగానే వర్షాలు కురిసాయి. దీంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారే గానీ, పదును కాక బీళ్లుగా వదిలేశారు. ఈ కింది గణాంకాలు చూస్తే ఈ ఏడాది వర్షపాతం ఎంత తక్కువగా నమోదు అయ్యిందో గమనించవచ్చు.

తగ్గిన సాగు విస్తీర్ణం

అన్నమయ్య జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 36 వేల ఎకరాలు కాగా, ప్రభుత్వం 35 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను సబ్సిడీపై పంపిణీ చేసింది. ఈ కాయల నుంచి ఒలిచి విత్తేందుకు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో వేరుశనగ ఎక్కువగా సాగయ్యే పీటీఎం, పెద్దమండ్యం మండలాలతో పాటు మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, రాయచోటి వ్యవసాయ డివిజన్లలో అతి తక్కువగా వర్షాలు పడ్డాయి. గత రెండేళ్లతో పోలిస్తే 150 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో అక్కడక్కడ తప్ప ఈ డివిజన్‌లో కూడా రైతులు వేరుశనగ విత్తలేకపోయారు. జిల్లా మొత్తం మీద కేవలం 4,600 ఎకరాల్లో మాత్రమే వేరుశనగ సాగైంది.



సాగుకు సిద్ధం చేసుకున్న విత్తనాలు

నేటితో ముగిసిన అదును

వ్యవసాయశాఖ క్యాలెండర్ ప్రకారం నైరుతి రుతుపవనాలు ప్రవేశించే జూన్ నెల నుంచి జూలై 15వ తేదీ వరకు వేరుశనగ విత్తనాలు విత్తేందుకు జిల్లాలోని వాతావరణం అనుకూలిస్తుంది. జూలై 15 తరువా త విత్తితే ఆశించిన మేర దిగుబడి రాదు. కొంత మంది రైతులు ఆగస్టు మొదటి వారం వరకు వర్షాలు కురుస్తాయేమో అన్న ఆశతో వున్నా, అనుకున్న మేర దిగుబడి రాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు.

చట్నీలకు, నూనెకు సబ్సిడీ విత్తనాలు

ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో 35 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయగా. ఇందులో సుమారు 4వేల క్వింటాళ్లు మాత్రమే విత్తనానికి నోచుకున్నాయి. మిగిలిన కాయల న్నీ రైతుల ఇళ్లలో నిలిచిపోయాయి. సీజన్ ముగియడంతో చాలా మంది రైతులు సబ్సిడీ విత్తనాలను వ్యాపారులకు విక్రయిం చేస్తుండగా, కొందరు ఇళ్లలో వంటకాలకు, చట్నీలకు వాడుకుంటున్నారు. మరికొందరు వేరుశనగ నూనె ఆడించుకుని భద్రపరుచుకుంటున్నారు.

ఉలవల సాగే దిక్కు.

వేరుశనగ సాగు లేకపోవడంతో ఈ సారి మెట్ట రైతులకు ఉలవల సాగే దిక్కయింది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలు ఉలవల సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో రైతులు వ్యవసాయ శాఖ అందించే ఉలవల విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అవసరమ య్యే విత్తనాలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారికి ప్రతిపాదనలు పంపుతున్నారు.

సంవత్సరం	నెల	సాధారణ వర్షపాతం (మి.మీ)	నమోదైన వర్షపాతం (మి.మీ)	తేడా
2023-24	జూన్	75.1	44.4	- 40.9
	జూలై	90.5	58.4	- 35.5
	ఆగస్టు	99.8	31.1	- 68.8
	సెప్టెంబరు	11,7	165,4	+ 44.2
2024-25	జూన్	75.1	155.6	+107.2
	జూలై	90.5	48.8	- 46.1
	ఆగస్టు	99.8	101.7	+ 1.9
	సెప్టెంబరు	114.7	61.3	- 46.6
2025-26	జూన్	75.1	26.6	- 64.6
	జూలై	37.5	3.7	- 90.2

ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. వాల్మీకిపురం మండలానికి చెందిన అంజప్ప తన కుడికాలును అనారోగ్య కారణాల రీత్యా పూర్తిగా తీసివేశారని, తనకు ద్విచక్రవాహనాన్ని ఇప్పించాలని కోరారు. నందలూరు మండలానికి చెందిన సాంబశివనాయుడు తన కూతురికి వివాహమైందని, అందువల్ల తన కూతురిని తన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నుంచి వేరు చేయాలని విన్నవించుకున్నారు. రాయచోటిలో నివసిస్తున్న చాంద్‌బాషా తనకు 75 సంవత్సరాల వయస్సు అని, ఎటువంటి పనిచేయలేని పరస్థితిలో ఉన్నానని, తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో 8 సింగిల్ విండోలకు త్రీమెన్ కమిటీలు

కలికిరి/ కడప రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 8 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (ప్యాక్స్) ముగ్గురు పాలకవర్గ సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అనంతపల్లె సొసైటీకి ఛైర్మన్‌గా ఎ.కొండయ్య, సభ్యుడుగా ఎం.గురుభాస్కర్ రెడ్డి, టి.మధుసూదన రెడ్డిలను నియమించారు. పొందలూరు ఛైర్మన్‌గా సి.వెంకటేశు, సభ్యులుగా టి.పెంచలయ్య, ఆర్.గంగాధరమ్మ, అనంతసముద్రం సొసైటీకి ఛైర్మన్‌గా ఎం.మల్లికార్జు, సభ్యులుగా ఆకేపాటి పెద్దా రెడ్డి, మేకల పట్టాభి, అనంతయ్యగారిపల్లె సొసైటీకి ఛైర్మన్‌గా నాగా లక్ష్మీకర్ రెడ్డి, సభ్యులుగా వై.నారాయణ, మల్లు శ్రీనివాసులు రెడ్డి, గాలివీడు సింగిల్ విండోకు ఛైర్మన్‌గా వి.శ్రీనివాసులు రెడ్డి, సభ్యులుగా పసుపుల శేఖర్ రెడ్డి, కొర్రు రామప్ప నాయుడు, సంబేపల్లె సొసైటీకి ఛైర్మన్‌గా వంగిమళ్ళ శివప్రసాద్ రెడ్డి, సభ్యులుగా కె.సుబ్బరాజు, పూజల రాధ, చిన్నమండెం సొసైటీకి ఛైర్మన్‌గా కోపూరి శివయ్య నాయుడు, సభ్యులుగా దేవరింటి నాగేశ్వర, పడమటికోన గంగి రెడ్డి, లక్కిరెడ్డిపల్లె సింగిల్ విండోకు ఛైర్మన్‌గా వీరబల్లి లక్ష్మీ రాజు, సభ్యులుగా చింతమాని రామసుబ్బయ్య, సిబ్యాల వెంకట్రమణను నియమిస్తూ సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

కడప జిల్లాలో నాలుగు సింగిల్ విండోలకు..

కడప జిల్లాలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్)కు ముగ్గురు పాలకవర్గ సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. లింగాపురం సొసైటీకి ఛైర్మన్‌గా సిద్దారెడ్డి నాగముని రెడ్డి, సభ్యులుగా డి.రామకృష్ణ, పసుపుల లక్ష్మీనారాయణమ్మ, వద్దిరాల సొసైటీకి ఛైర్మన్‌గా ఎ.కొండయ్య, సభ్యులుగా మందాడి గురుభాస్కర్ రెడ్డి, టంగుటూరు మధుసూదన రెడ్డిని నియమించారు. అదే విధంగా కె.అగ్రహారం సొసైటీకి ఛైర్మన్‌గా జి.ఆర్.హరినాథ రెడ్డి, సభ్యులుగా జంపన ఓబుల్ రెడ్డి, సీహెచ్ నాగేశ్వరుడు, దువ్వూరు సొసైటీకి ఛైర్మన్‌గా పోలు రామమోహన్ రెడ్డి, సభ్యులుగా ఎం.వెంకటేశ్వర రెడ్డి, బి.శివశంకర్‌లను నియమిస్తూ సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యానవన పంటలకు రాయితీ

- జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి

రాయచోటి(కలెక్టరేట్), జూలై14(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు రైతులకు రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. పంటల కోత అనంతరం వాటిని గ్రేడింగ్, ప్యాకింగ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆమె తెలిపారు. దీంతో పాటు పండ్లు, పూలు, కూరగాయల పంటలకు బీమా కూడా కల్పిస్తుందని తెలిపారు. నీటి ఎద్దడి తట్టుకునేందుకు వీలుగా వ్యక్తిగత నీటికుంటల ఏర్పాటుకు 50 శాతం రాయితీతోపాటు, సామూహిక నీటికుంటలు తవ్వేందుకు అయ్యే ఖర్చులో 75 శాతం ఇస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం రాయచోటి హార్టికల్చర్ అధికారిని (9703814184) సంప్రదించాల్సిందిగా ఆమె తెలిపారు.

ఐటీఐ దరఖాస్తు గడువు పెంపు

పీలేరురూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ప్రభుత్వ ఐటీఐ)లో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 20వ తేదీ వరకు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.బాలమురళీప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండవ విడత ప్రవేశం కోసం దరఖాస్తు గడువు పెంచినట్లు చెప్పారు. ఈ నెల 20న సాయంత్రం లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 22 లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక



శ్వేత



మనోహర్

పెద్దతిప్పసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా శ్వేత, మనోహర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మండలంలోని నవాబుకోట గ్రామపంచాయతీ కార్యదర్శి శ్వేతను, ఉపాధ్యక్షుడిగా కందుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న జి.మనోహర్‌ను ఎన్నుకున్నారు.

మంత్రిపై అభ్యంతరకర పోస్టు పెట్టిన వ్యక్తి అరెస్టు



నిందితుడిని చూపుతున్న సీఐ

రాయచోటిటౌన్, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డిపై అభ్యంతరకర పోస్టు పెట్టిన హైదరాబాద్‌కు చెందిన ఎరమాల అన్వేష్ రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ వెంకటాచలపతి తెలిపారు. ఈ నెల 12న ఫేస్ బుక్‌లో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖా మంత్రి మం డిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడిన వీడియోపై అభ్యంతరకర పోస్టు పెట్టిన అన్వేష్‌రెడ్డిపై మంత్రి పీఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన్ను అరెస్టు చేసి రాయచోటి అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపెట్టిగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కర్నూలును కట్టడి చేసిన కడప బౌలర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని అనంత క్రీడాగ్రామంలో సోమవారం నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. తౌఫీక్ హుస్సేన్ (49), మురళి (40), ఇస్మాయిల్ (44), అంజనేయులు (31) ఫర్వాలేదని పించారు. కడప బౌలర్లు పఠాన్‌షరీఫ్ 4, అరీఫ్‌బాషా 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 23 ఓవర్లలో వికెట్ నష్టానికి 117 పరుగులు చేసింది. వంశీకృష్ణ అజేయ హాఫ్ సెంచరీ (77)తో కొనసాగుతున్నాడు.

పిచ్చికుక్కల వీరంగం.. పలువురికి గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన నందకిశోర్

సిద్ధవటం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నాలుగు రోజులుగా పిచ్చికుక్కలు వీరంగం చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దిగువపేట బేల్దారి వీధికి చెందిన ఫాతిమా(5), గాంధీవీధికి చెందిన కోటపాటి నందకిషోర్(6), పాలెం వసంత, గుర్రయ్య మరికొందరిపై పిచ్చికుక్క దాడి చేయడంతో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చికిత్స చేయించు కుంటున్నారు. ఈ విషయంపై కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళిని వివరణ కోరగా పిచ్చికుక్క కాటుకు గురైన ఐదుగురికి చికిత్స చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశామని వివరించారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్



నిందితుడు హేమవర్ధన్

సిద్దవటం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తూ జూలై 5న పట్టుబడ్డ కడప నగరానికి చెందిన రెడ్డి సురేష్ విచారణలో మరి కొంత మంది పేర్లు చెప్పడంతో సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు పలు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు, చేశారు సిద్దవటం మండలం మాధవరం, పార్వతీపురం గ్రామాల్లోని శీతలగంగమ్మ గుడి ఆలయం సమీపంలో ఆదివారం కడప నగరం ఎన్జీవో కాలనీకి చెందిన హేమవర్ధన్ అలియాస్ హేము అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం సోమవారం అతనిని సిద్దవటం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

సుండుపల్లె, జూలై14(ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వరకట్నం తీసుకురావాలని తన భర్త మరికొందరు వేధిస్తున్నారని రాయవరానికి చెందిన జనత్‌ఉన్నీసా ఫిర్యాదు చేయడతో రాయచోటికి చెందిన సయ్యద్ అజ్మత్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఐదేళ్ల క్రితం జనత్‌ఉన్నీసాకు, సయ్యద్ అజ్మత్‌కు వివాహమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

సుండుపల్లె, జూలై 14(ఆంధ్రజ్యోతి): నీటి విషయంలో జరిగిన గొడవకు సంబంధించి ఆరుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ జంగంపల్లికి చెందిన వీరనాగయ్య ఫిర్యాదు మేరకు రవి, రమణ, భద్రయ్యపైన, రవి ఫిర్యాదు మేరకు వీరనాగయ్య, హనుమంతు, ఓ మహిళపై కేసు నమోదు చేశామన్నారు.

భర్త మోసం చేశాడని మహిళ ఆందోళన



మాట్లాడుతున్న ధనలక్ష్మి

బి.కొత్తకోట, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): భర్త మోసం చేశాడు. అతిత్తింటి వారు ఆదుకోలేదు.. పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదు.. నేనూ నాబిడ్డలు ఏమై పోవాలంటూ ఓ వివాహిత రోడ్డెక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ధనలక్ష్మి బి.కొత్తకోట పట్టణానికి చెందిన శివ నాగేంద్రను నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ మధ్య కాలంలో అతను ధనలక్ష్మిని నిర్లక్ష్యం చేస్తుండడంతో భర్త తల్లి సరస్వతిని పలుమార్లు ప్రశ్నించింది. సరైన సమాధానం రాకపోవడంతో బి.కొత్తకోట పోలీసులు, మదనపల్లె డీఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఫలితం లేకపోవడం తో సోమవారం బి.కొత్తకోటలోని బైపాస్ రోడ్డుపై బైఠాయించింది. విషయం తెలుసుకున్న సీఐ జీవన్ గంగనాథ్‌బాబు అక్కడికి చేరుకుని ధనలక్ష్మితో మాట్లాడారు. చుట్టు పక్కల నివాసమున్న జనం పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇంతకాలంగా మొరపెట్టుకున్నా తనకు, తన బిడ్డలకు న్యాయం చేయలేదని అందుకే రోడ్డు ఎక్కానని తెలిపింది. తనకు అన్యాయం చేసిన భర్త శివనాగేంద్ర, అతనికి సహకరిస్తున్న తల్లి సరస్వతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సుమారు రెండు గంటల పాటు ఈ నిరసన కార్యక్రమం కొనసాగింది. చివరకు చుట్టు పక్కల ఉన్న ప్రజలు, పోలీసులు న్యాయం చేస్తామంటూ స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు తీసుకున్నారు. మహిళకు న్యాయం చేస్తామని సీఐ తెలిపారు.

పేదలకు చేయూతకే పీ4

- బంగారు కుటుంబాలతో మార్గదర్శకులను జత చేయాలి
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి, తదితరులు

కలికిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు చేయూత ఇచ్చి వారు సంపన్నుల జాబితా లోకి రావడానికే సీఎం చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించారని కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలికిరిలో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మండల, గ్రామ స్థాయి అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో 11 వేల పేదల కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ బంగారు కుటుంబాలకు అండ గా నిలబడి ఆసరా కల్పించేందుకు మార్గదర్శులు ముందుకు రావాలని కోరారు. మార్గదర్శులను గుర్తించి వారికి కొన్ని బంగారు కుటుంబాలను అప్పగించి సమన్వయపరచడానికి అధికారులు కృషి చేయాల్సి ఉంటుందని చెప్పారు. మనమేమీ వారికి మన ఆస్తులు ఇవ్వాల్సిన పనిలేదు.. గుర్తించిన బంగారు కుటుంబాలను సరైన మార్గదర్శులకు అప్పగిస్తే చాలని సూచించారు. అనంతరం మార్గదర్శులు కూడా ఆ కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటూ వారు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న రంగాల వైపు వారిని ప్రోత్సహించాల్సి ఉంటుందన్నారు. తాను మళ్లీ మండల స్థాయి సమావేశాలు నిర్వహించి పీ4 పైన పురోగతి గురించి సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల ఉద్యోగులు, అధికారులు గౌరవప్రదంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తెలిపారు. పీఎం సూర్యఘర్ ద్వారా సోలార్ విద్యుదుత్పత్తికి ప్రజలంతా ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గం ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ పీలేరు ప్రాంతంలో టమోటా, మామిడి పండ్ల ఉత్పత్తి ఎక్కువగా ఉన్నందున ఇక్కడ పల్ప్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించాలని కోరారు. అదేవిధంగా పాడి పరిశ్రమ ప్రధాన జీవనాధారంగా ఉందని, డెయిరీల ఏర్పాటును ప్రోత్సహిస్తే సత్ఫలితాలుంటాయన్నారు. పీలే రు ఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సోలార్ విద్యుత్తుకు పరికరాలు ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేల వరకూ సబ్సిడీ లభిస్తుందని, విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదని తెలిపారు.

కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సచివాలయ ఉద్యోగు లు, ప్రజాప్రతినిధులు, మండల టీడీపీ అధ్యక్షుడు, అనుబంధ విభాగాల నాయకులు, బూ త్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండోల అధ్యక్షులు హాజరయ్యారు.

తొమ్మిదిమంది ఇంజినీర్లపై విచారణకు ఆదేశం

- 'భీమగుండం ఎత్తిపోతల'అక్రమాలపై ప్రభుత్వం చర్యలు

కలికిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కడప జలవనరుల శాఖలో గతంలో పనిచేసిన తొమ్మిది మంది ఇంజినీర్లపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 అక్టోబరు 28న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అందజేసిన నివేదికపై ఇంజినీర్ల నుంచి వివరణలు తీసుకున్న అనంతరం పూర్తి సమాచారం కోసం సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా పెద్దముడియం మండలంలో కుందూ నదిపై భీమగుండం ఎత్తిపోతల పథకం నిర్మాణం, దానికి ఇతరత్రా జరిగిన ఏర్పాట్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ గుర్తించింది. ఈ అక్రమాలకు తొమ్మిది మంది ఇంజినీర్లను బాధ్యులుగా తేల్చింది. అప్పట్లో దీన్ని పర్యవేక్షించిన హైదరాబాదు డిప్యూటీ చీఫ్ ఇంజినీరు (ఏపీఎస్ఐడీసీ) వై.భాస్కర్ రెడ్డి, ఏపీఎస్ఐడీసీ కడప డివిజన్ ఈఈ కె.ఎస్.డి. గౌడ్ (ప్రస్తుతం రిటైర్డు), కడప ప్రాజెక్టు ఆఫీసు డీఈఈ వి.సుధీర్ కృపానంద్, ఏఈఈఈ కె.కృష్ణ, కడప డివిజన్ క్యూసీ ఏఈఈ ఎ.హరిగోపాల్ (ప్రస్తుతం బనగానపల్లె డీఈఈ), డీఈఈ క్యూసీ డి.దినకర్ బాబు (రిటైర్డు), డీఈఈ క్యూసీ ఎస్.ఇక్బాల్ హుస్సేన్ (ప్రస్తుతం పులివెందుల జీఎన్ఎస్ఎస్ డీఈఈ), కడప క్యూసీ ఈఈ ఎ.ఉమేష్‌కుమార్ (ప్రస్తుతం విశాఖపట్నం ఈఈ), కడప క్యూసీ ఈఈ యు.రాజశేఖర్ (ప్రస్తుతం పులివెందుల పీబీసీ ఈఈ)లను బాధ్యులుగా నిర్ధారించారు. వీరు గతంలో సమర్పించిన సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో మరింత లోతుగా విచారణ చేయడానికి కడప (రాయలసీమ రీజియన్) క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీరు ఎం.కిరణ్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించారు. అక్రమాలకు సంబంధించిన అభియోగాలకు సంబంధించిన వివరాలు, బాధ్యులు సమర్పించిన సంజాయిషీలన్నింటినీ విచారణాధికారికి పంపుతున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. .

క్వాంటమ్ పెన్షన్ గోల్‌మాల్‌పై విచారణ



విచారణ చేస్తున్న ఎస్ఏవో బ్రహ్మయ్య తదితరులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లె, జూలై 14(ఆంధ్ర జ్యోతి): విద్యుత్ శాఖలో క్వాంటమ్ పెన్షన్ గోల్‌మాల్ వ్యవహారంపై ఆశాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్(ఎస్ఏవో) బ్రహ్మయ్య సోమవారం విచారణ చేశారు. ఫ్యామిలీ పెన్షన్‌లో గోల్‌మాల్.. వయసు పెంచి.. పెన్షన్ కాజేసి.. అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనా నికి స్పందించిన ఉన్నతాధికారులు శుక్రవారమే ఆరా తీశారు. సోమవారం అయిదుగురు సభ్యులతో కూడిన అధికారుల బృందం విచారణ ప్రారంభించింది. మదనపల్లె విద్యుత్ డివిజన్ పరిధిలో సాధారణ, క్వాంటమ్ పెన్షన్‌దారుల జాబితాపై ఆరా తీస్తున్నారు. ఇందులో మొత్తం 493 పెన్షన్‌దారులు ఉండగా, అందులో 292 మంది ఫ్యామిలీ క్వాంట మ్ పెన్షన్‌దారులు ఉన్నట్లు ఎస్ఏవో తెలిపారు. వీరికి ఎప్పటి నుంచి పెన్షన్ ఇస్తున్నారు.. క్వాంటమ్ అమలులోకి వచ్చి రివైజ్ అయిన 2022 నుంచి ఎంతమందికి ఇచ్చారు. పెన్షనర్ల వయస్సు ఎంత? ఎంత పెంచారు? ఎంత ఇచ్చారు. అదనంగా ఇచ్చిన సొమ్ములెంత? అందులో అరియర్స్, తదితర వివరాలపై ఆరా తీస్తున్నారు. అందుకు సంబంధించిన జాబితా, మంజూరు చేసిన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే విద్యుత్తుశాఖ డివిజన్ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్ విభాగం జూనియర్ అకౌంట్ ఆఫీసర్ పి.పార్వతి, జూనియర్ అసిస్టెంట్ గురుప్రసాద్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన ఫైళ్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పెన్షన్‌దారుల వివరాలు, ఫైళ్లను తనిఖీ చేయాల్సివుందని, పూర్తికావడానికి నాలుగురోజులు సమయం పడుతుందని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఎస్ఏవో బ్రహ్మయ్య వివరించారు. ఇందులో మదనపల్లె, రాయచోటి విద్యుత్తుశాఖ అధికారులు వెంకటేష్, సాయి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పెద్దపాపిరెడ్డి మృతదేహం

మైలవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, అనారోగ్య సమస్యల కారణంగా దన్నవాడ గ్రామానికి చెందిన పులిచెర్ల పెద్ద పాపిరెడ్డి (49) విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. పెద్ద పాపిరెడ్డికి వ్యవసాయంలో పంట దిగుబడి సక్రమంగా రాక అప్పులు ఎక్కువ కావడం, అనారోగ్య సమస్యలు పీడిస్తుండడంతో జమ్మలమడుగు-తాడిపత్రి బైపాస్‌రోడ్డు పక్కన ముళ్లపొదల వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పాపిరెడ్డి కొన్ని నెలలుగా జమ్మలమడుగులో నివాసం ఉంటున్నారు. మృతుని కుమారుడు మునిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

ప్రొద్దుటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు - బద్వేలు రోడ్డులోని జీవీ సత్రం వద్ద ప్రొద్దుటూరు ఫారెస్టు రేంజ్ అధికారులు ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. సోమవారం మైదుకూరు - బద్వేలు రహదారిలో జీవీ సత్రం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా.. ఒక వాహనంలో అనుమానస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వారిని


గాయపడిన ఎర్రచందనం స్మగ్లర్

వెంబడించగా ఒకరు పారిపోగా.. మరోవ్యక్తి కాలుకు గాయమై పట్టుబడ్డాడు. అతన్ని ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కాలుకు ఫ్యాక్చర్ అయినట్లు వైద్యులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రొద్దుటూరు ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ పట్టుపడ్డ వ్యక్తి వనిపెంటకు చెందిన పాత ఎర్ర చందనం స్మగ్లర్ నాగేంద్ర అని.. అతనిపై ప్రొద్దుటూరు రేంజ్ పరిధిలో పలు కేసులు ఉన్నాయన్నారు. అతను తాడిపత్రికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డితో కలసి మల్లేపల్లె ఏరియాలో వున్న ఎర్రచందనం దుంగలను తీసుకువెళ్లడానికి వచ్చారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రెండో గాంధీ బొమ్మ వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తికి ఫిట్స్ రావడంతో కింద పడిపోయినట్లు వన్ టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి 62 సంవత్సరాల వయసు ఉంటుందని, ఇతర వివరాలకు 9121100510, 9121100511 నెంబర్లకు ఫోను చేసి తెలుసుకోవాలని కోరారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లి బిడ్డలు అదృశ్యం



అదృశ్యం అయిన యమున, పిల్లలు

కడప క్రైం జూలై 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎన్‌జీఓ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన నివాసం ఉంటున్న పోకూరు యమున (30) తన ఇద్దరి బిడ్డలతో కలిసి అదృశ్యం అయినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు... యమున భర్త పోకూరు సురేష్ కుమార్, పిల్లలు సిందూరి, కుసుమాంజలితో గత నెల 23న ఇంట్లో పడుకొని నిద్రపోయారు. 24వ తేదీ ఉదయం యమున ఇద్దరు పిల్లలను తీసుకొని అదృశ్యం అయినట్లు తెలిపారు. బంధువులు ఇళ్లలో వెతికినప్పటికీ ఆమె ఆచూకి తెలియకపోవడంతో భర్త సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అదృశ్యం అయిన వారు ఎక్కడైనా కనిపిస్తే 9121100520, 9121100521, 9121100522 ఫోన్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎరువుల ధరలు తగ్గించాలి

● అదాని స్మార్ట్ మీటర్లు వద్దు : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రసాయన ఎరువుల ధరలు అమాంతంగా పెంచడం అన్యాయం, దుర్మార్గమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికారి ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. 50 కేజీల పొటాష్‌పై రూ.265, 10:26:26 బస్తాపై రూ.330, 12:32:16 బస్తాపై రూ.250 పెరిగాయని పేర్కొన్నారు. ఒకవైపు వర్షాలు పడక, గిట్టుబాటు ధర లభించక, అన్నదాత సుఖీభవ పథకం అమలు కాక రైతులు లబోదిబోమంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పెంచిన రసాయన ఎరువుల ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్‌స్మార్ట్ మీటర్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం రెండు నాల్కల ధోరణి ప్రదర్శించడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను జగన్ ప్రభుత్వం బిగిస్తే అడ్డుకోండి, పగులగొట్టండి అని టీడీపీ, జనసేన నాయకులు ప్రజలకు చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రభుత్వమే స్మార్ట్ మీటర్లు బిగించడం గర్హనీయమని తెలిపారు.



సర్వే నెంబరు 17లో ధ్వంసమైన చెక్‌డ్యామ్, సర్వే నెంబరు 628లో ఆక్రమణకు గురైన చెక్‌డ్యామ్

చెక్ డ్యాములను వదలని అక్రమార్కులు

● ధ్వసం చేసి వైసీపీ నేతల ఆక్రమణ

● తుమ్మలూరు రెవెన్యూ గ్రామ పరిధిలో ఈ తతంగం

పెండ్లిమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నీటి ఎద్దడి నివారణకు ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టి సస్యశ్యామలం చేసేందుకు వాగులు, వంకల ద్వారా ప్రవహించే నీటికి అడ్డుకట్ట వేసి వృథాకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వాలు నీరుచెట్టు, జలయజ్ఞం లాంటి కార్యక్రమాల ద్వారా చెక్‌డ్యాములను నిర్మించారు. ఈ చెక్‌డ్యాముల ఏర్పాటు వల్ల భూగర్భ జలాల నీటిమట్టం పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో నీటి లభ్యత పెరుగుతుంది. తెలుగుదేశం ప్రభుత్వం నీరుచెట్టు ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టింది. వాగులు, వంకల్లో పూడిక తీత పనులు, కందకాల ఏర్పాటు, ట్రెంచ్‌లు, చెక్‌డ్యాములు నిర్మించింది. అయితే కబ్బాకు కాదేది అనర్హం అన్నట్లు ఎంతో గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాములను వదలకుండా ధ్వంసం చేసి ఆక్రమించడం వైసీపీ నేతలకే చెల్లు. తుమ్మలూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 17, 628, 152, 38, 574 సర్వే నెంబర్లలో కొన్ని సంవత్సరాల క్రితం మూగ జీవాల తాగునీటి కోసం, ఆ చుట్టు ప్రక్కల భూగర్భ జలాలను పెంచేందుకు చెక్‌డ్యాములను నిర్మించారు. అయితే ఈ చెక్‌డ్యాములను గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ధ్వంసం చేసి ఆక్రమించేసి అక్కడ బోర్లు వేసుకుని భూములు సాగు చేస్తున్నారు. నీరు చెట్టు కింద చేసిన పనులకు గత వైసీపీ ప్రభుత్వం విజిలెన్స్ విచారణ పేరుతో బిల్లులు నిలబెట్టారు. ఏడాది క్రితం ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ఆ బిల్లులను చెల్లించింది. ఈ చుట్టు పక్కల పొలాలు ఉన్న రైతులు గతంలో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండేదని మళ్లీ వాటర్‌షెడ్ల కింద చెక్‌డ్యాములను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రూ.14లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

● వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీ ● రిటైల్ దుకాణంలో అనధికారిక గోడౌన్ బయటపడిన వైనం


మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం కర్నూలు, తిరుపతికి చెందిన వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా స్థానిక అధికారులతో కలిసి సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మి హోల్ సేల్, రీటైల్ ఫర్టిలైజర్స్ దుకాణంలో కర్నూలుకు చెందిన డీఆర్‌సీ కేంద్ర ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు, తిరుపతి విజిలెన్స్ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, కడప డీఏవో కార్యాలయ టెక్నికల్ ఏవో ఎస్.గోవర్ధన్, ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖాధికారి ఎస్.వరాహరికుమార్‌లు కలిసి పలు రికార్డులను తనిఖీ చేశారు. దుకాణ నిర్వాహకులు అధిక మొత్తంలో స్టాకును ఉంచి అనధికారిక గోడౌన్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. స్టాకు వివరాలను పరిశీలించి రూ.14లక్షలు విలువచేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. నియమ నిబంధనల ప్రకారం గోడౌన్‌ను ఏర్పాటు చేసుకుని అనుమతులు పొందిన తర్వాత ఈ స్టాకును అక్కడికి తరలించి తదుపరి అమ్మకాలకు అధికారులు ఆదేశాలు జారీ చేయనున్నారని ఏవో తెలిపారు.

బాలాయపల్లెలో సమస్యలపై ఆర్డీవో ఆరా


బాలాయపల్లెలో తాగునీటి బోరును పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమౌళి

కాశినాయన జూలై 14(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని బాలాయపల్లెలో సోమవారం బద్వేల్ ఆర్డీవో చంద్రమౌళి పర్యటించి తాగు, సాగునీటి సమస్యలపై ఆరా తీశారు. ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బాలాయపల్లెకు వచ్చిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త రితీష్‌రెడ్డిలకు గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, తెలుగంగ నీటిని ఎత్తిపోతల ద్వారా బాలాయపల్లె చెరువుకు అందించాలని, అంగన్వాడీ భవనం అన్యాక్రాంతమైందని, గతంలో మంజూరైన మా గ్రామ సచివాలయాన్ని వేరొక మండలానికి మార్చారని గ్రామస్తులు ఏకరువు పెట్టారు. సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఈవిషయాలన్నింటిని మంత్రి గొట్టిపాటి వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకపోయారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో చంద్రమౌళి సోమవారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో, స్థానిక అధికారులు సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బోర్లు ఎన్ని ఉన్నాయి.. వాటిలో నీటిలభ్యత ఏవిధంగా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న బోరును పరిశీలించి వాడుకలోకి తేవాలని ఆదేశించారు. బాలాయపల్లె చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీరు అందించే విషయంపై క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యా సాధ్యాలపై చర్చించారు.. అనంతరం గొంటువారిపల్లె గ్రామ సచివాలయంలో అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై గ్రామసమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఈవోపీఆర్డీ ముజఫర్ రహీమ్, డీఈ అబ్దుల్ ఖాదర్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఏఈలు బాలపుల్లయ్య, ఓబయ్య, టీడీపీ నాయకులు డి.క్రిష్టారెడ్డి, జయరామిరెడ్డి, పి.పోలిరెడ్డి, నాయనపల్లె రమణారెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

హైవపర్ విద్యుత్తు లైన్‌ను అడ్డుకున్న రైతులు


చింతకొమ్మదిన్నె చెరువులో నిర్మిస్తున్న హైపవర్ టవర్ల నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు

సీకేదిన్నె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌వారు అనంతపురం నుంచి కడపకు తీసుకొస్తున్న 400 కేవీ హైటెన్షన్ విద్యుత్తు టవర్ నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. చింతకొమ్మదిన్నె చెరువులో సోమవారం హైటెన్షన్ టవర్ నిర్మాణం జరుగుతున్న విషయం తెలుసుకున్న మండలంలోని లింగారెడ్డిపల్లె, దవలాస్‌పురం, పడిగెలపల్లి, బుగ్గలేటిపల్లి జమాల్‌పల్లి, తదితర గ్రామాల రైతులు అక్కడకు చేరుకుని అధికారులను ముట్టడించి టవర్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణపు డిజైన్‌లో లోపాలు ఉన్నాయని, వాటిని సవరించకుండా అధికారులు ఇష్టం వచ్చినట్లు టవర్లు వేస్తే తమకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణం ద్వారా కడప-రాయచోటి జాతీయ రహదారికి సమాంతరంగా దాదాపు నాలుగైదు కిలోమీటర్లు లైన్ వెళుతుందన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులతోపాటు రెండు జిల్లాలకు కనెక్టివిటి అధికంగా ఉందని, రాబోవు కాలంలో అభివృద్ధికి విద్యుత్తు టవర్లు ఆటంకంగా మారుతాయన్నారు. జాతీయ రహదారికి సమాంతరంగా విద్యుత్తు లైన్ వెళ్లడం ద్వారా తాము ఎంతో విలువైన పొలాలను కోల్పోతామన్నారు. పవర్‌గ్రిడ్ అధికారులు అనంతపురం, గుత్తి, కడప కార్యాలయాలను సంప్రదించి అర్జీలు సమర్పించినప్పటికీ ఎటువంటి మార్పులు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంవత్సరం క్రితమే జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ నందు ఫిర్యాదు చేశామన్నారు. పక్కా వ్యాపార సంస్థ అయిన పవర్‌గ్రిడ్ కడప-రాయచోటి జాతీయ రహదారి వెంబడి పొలాల మీదుగా డిజైన్లు తయారు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కడప ఆర్డీవో, చింతకొమ్మదిన్నె తహసీల్దారుకు రైతులు సమస్య వివరించడంతో లైన్లు పక్కకు మార్చి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత డిజైన్ ప్రకారమే తిరిగి నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టడంపై రైతులు ఆందోళన చేపట్టి టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఇప్పటికైనా పవర్‌గ్రిడ్ అధికారులు తమ డిజైన్లు మార్చుకుని ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

ఉత్సాహంగా సాగిన బ్యాడ్మింటన్ పోటీలు


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి అండర్-11, అండర్-13 బ్యాడ్మింటన్ ఎంపికలు సోమవారం జార్జ్‌కారొనేషనల్ క్లబ్‌లో ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా 200 మంది బాలబాలికలు పాల్గొనగా సింగిల్స్ డబుల్స్ విభాగంలో పోటీలు నిర్వహించి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, జార్జిక్లబ్ కార్యదర్శి సుధాకర్ తెలిపారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అండర్-11 బాలికల విభాగంలో డి.ప్రణవి, సత్యరాయ్, తారావాకింగ్స్ (కడప), అండర్-13 బాలికల విభాగంలో డి.ప్రణవి, ఎం.అక్షర (కడప), నిహతిరెడ్డి, తారికారెడ్డి (ప్రొద్దుటూరు) ఎంపికయ్యారు. అండర్-11 బాలుర విభాగంలో వీబీజీ గౌతమ్, ఎస్‌వీ సాత్వికొరెడ్డి, హవీష్ (ప్రొద్దుటూరు), అండర్-13 బాలుర విభాగంలో ఎ.త్రిషాల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పీబీజీగౌతమ్ (ప్రొద్దుటూరు) ఎంపికయ్యారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బాలనాగయ్య, టోనీశ్యామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీటిని అందిస్తాం : పుట్టా


రాజోలి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టు కింద చివరి ఎకరాకు నీటిని అందిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. రాజుపాలెం మండలంలోని రాజోలి జలాశయం నుంచి సోమవారం కేసీ మెయిన్ కెనాల్‌కు ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కేసీ కెనాల్ ఆయకట్టును పట్టించుకొన్న పాపాన పోలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కేసీ కెనాల్ మరమ్మత్తుల కోసం రూ.కోటి 60 లక్షలు మంజూరు చేసిందన్నారు. అలగనూరు రిజర్వాయర్‌లో ఆనకట్ట పనులను పూర్తి చేసి కేసీ ఆయకట్టు కింద రైతులు ఏడాదికి రెండు కార్లు పంటలను పండించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, నంద్యాల రాఘువరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, పొలిమేర శివశంకర్‌రెడ్డి, బోరెడ్డి రమణారెడ్డి, అన్నవరం సుధాకర్‌రెడ్డి, తుపాకుల రమణ, బండి అమర్‌నాథ్, కేసీ కెనాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మా కుమార్తె వివాహానికి రండి

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గోవర్ధన్‌రెడ్డి ఆహ్వానం


ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వానపత్రిక ఇస్తున్న గోవర్ధన్‌రెడ్డి దంపతులు

కడప ఎర్రముక్కపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మా కుమార్తె వివాహానికి వచ్చి ఆశీర్వదించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడును కలిసి తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వివాహానికి హాజరు కావాలని కోరారు. ఆగస్టు 14వ తేదీ తిరుమలలో వివాహం, ఆగస్టు 24న కడప నగరంలోని మాధవి కన్వెన్షన్‌లో రిసెప్షన్ జరుగుతుందని ముఖ్యమంత్రికి తెలిపారు. ఇందుకు చంద్రబాబునాయుడు రిసెప్షన్‌కు వస్తానని తెలిపారని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం


వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవంపై ఏర్పాటు చేసి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి , అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకీ ఉత్సవం అనంతరం అర్చకులు పల్లకీ ఉత్సవ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

తాగునీటి కోసం ధర్నా



ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

బి.కొత్తకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వేములేటికోట పంచాయతీ బండమీదపల్లెకు చెందిన గ్రామస్థులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ రెండు నెలలుగా తమ గ్రామంలో ప్రభుత్వ తాగునీటి పథకం నుంచి నీరు రావడం లేదని, ఈ విషయంపై స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదని ఆరోపించారు. కాగా ఎంపీడీవో కృష్ణవేణి అందుబాటులో లేకపోవడంతో వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. బండమీదపల్లెకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పి-4 పథకానికి పలు కుటుంబాలు ఎంపిక

నిమ్మనపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న పి-4 (ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం) పథకం ద్వారా 506 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పి-4 పథకంలో వెనుకబడి అట్టడుగున వున్న 20 శాతం కుటుంబాలను గుర్తించి వారిని దత్తత తీసుకొని వారికి ఆర్థిక సమానతలు రూపుమాపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇప్పటికే డాక్టర్లు, ఇంజనీర్లు, ఎన్ఆర్ఐలు, వ్యాపారస్తులు ముందుకు వచ్చారని తెలిపారు. కాగా ఇప్పటికే పి-4 సర్వే పూర్తి కాగా వారిలో అనర్హులను గుర్తించేందుకు సంబంధిత అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్థన్‌రెడ్డి



బురకాయల కోట సమీపంలో ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి, చిత్రంలో జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బురకాయలకోట, వేపూరికోట, ములకలచెరువులలో సోమవారం మంత్రి పర్యటించారు. తొలుత బురకాయలకోట సమీపంలోని టోల్‌గేట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. వేపూరికోటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ములకలచెరువులోని టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా మంత్రిని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, రవిచంద్ర, ఎల్‌ఐసీ భాస్కర్‌రెడ్డి, జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయంలో

ములకలచెరువులో జనసేన పార్టీ కార్యాలయానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి వచ్చారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో ఆరు మండలాలకు చెందిన మండల అధ్యక్షులు, జనసైనికులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

రూ.5.51 కోట్ల పనుల ప్రారంభం

బి.కొత్తకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రూ.5.51 కోట్ల తారురోడ్డు నిర్మాణ పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. గోళ్లపల్లె పంచాయతీ కనికలతోపు నుంచి మదనపల్లె బి.కొత్తకోట మార్గంలోని ఉలవలవారిపల్లె వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద మంజూరైన తారు రోడ్డు పనులను నియోజకవర్గ ఇంచార్జ్ జయచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ బావాజాన్, సీడీపీవో భాగ్యమ్మ, ఏపీఎం రాజేశ్వరి, నారాయణస్వామిరెడ్డి, సిద్దారెడ్డి, లోకనాథ్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

రెండో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

రాయచోటిటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీలో పనిచేస్తున్న తాగునీరు, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరుకుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్షలో పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బవరం రామాంజులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 36 జీవోను అమలు చేసి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 16వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికులు కూడా సమ్మె బాట పట్టనున్నారన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

మాట తప్పడం టీడీపీ చరిత్రలో లేదు : ఎమ్మెల్యే

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రామసముద్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో మాట తప్పడం మడమ తిప్పడం టీడీపీ చరిత్రలో లేదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చెంబకూరులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు, తిప్పన్న, రాంమూర్తి, వెంకటరమణ, ఇన్‌చార్జి ఎంపీడీవో భానుప్రసాద్, ఎస్ఐ రమేష్‌బాబు, ఏఈ మస్తాన్‌వల్లి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లెటౌన్: మదనపల్లెలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మునిరత్నం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, మేధావుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.

జగన్‌ది సవతి తల్లి ప్రేమ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులపై వైసీపీ అధినేత జగన్ సవతి తల్లి ప్రేమ చూపించారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మండిపడ్డారు. సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మామిడి ధరలు తగ్గిపోయినప్పుడు రైతుల వద్ద బలవంతంగా అతి తక్కువ ధరలకు మామిడికాయలు కొనుగోలు చేసిన వైసీపీ నేతలు వారి ప్రాసెసింగ్ ప్లాంట్లకు తరలించలేదా అని ప్రశ్నించారు. అప్పుడు రైతుల మీద లేని ప్రేమ ఇప్పుడు పుట్టుకొచ్చిందా అని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, బాలుస్వామి, షంషీర్, సహదేవ నాయుడు, సుద్దిళ్ల సుధాకర్, కత్తి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రైవేటు లైసెన్స్ ఇంజనీర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సోమవారం ప్రారంభించారు. విగ్రహావిష్కరణకు సహకారం అందించిన లైసెన్సు ఇంజనీర్ల కృషిని ఎమ్మెల్యే అభినందించారు.

17న వాహనాల వేలం

మదనపల్లెటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేయబడిన 60 వాహనాలను ఈ నెల 17న బహిరంగ వేలం వేయనున్నామని ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ ఆధ్వర్యంలో ఈ వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు వారి ఆధార్‌కార్డులతో పాటు, డిపాజిట్ మొత్తాన్ని తీసుకు రావాలన్నారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

కలికిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ కార్యదర్శుల నూతన సంఘాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయం సమావేశ భవనంలో సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో రియాజ్ అహ్మద్ ఎన్నికల పరిశీలకుడిగా హాజరయ్యారు. కలికిరి కార్యదర్శి జి.అశోక్‌ను సంఘం అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా బి.నవాజుల్లా, వి.గంగాదేవి, కోశాధికారిగా జి.గిరి, మీడియా కార్యదర్శిగా తనూజ, ప్రధాన కార్యదర్శిగా బి.గోపి, కార్యవర్గ సభ్యులుగా బి.తిమ్మారెడ్డి, సాయి కృష్ణ, మౌనిక, జెనీఫా, మునిరాజ, రామ్మూర్తి నాయుడులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో భానుమూర్తిరావు, ఏవో సురేంద్రబాబు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఒకరికి గాయాలు

రామసముద్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన అమ్మవారి ఊరేగింపులో కొందరు యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వివరాల మేరకు.. అమ్మవారి ఊరేగింపు స్థానిక ఎగువ పెట్రోల్ బంకు వద్దకు రాగా దుర్గమ్మ కాలనీకి చెందిన మునెమ్మ కుమారుడు ధనుష్ ఊరేగింపుకు అడ్డుగా డ్యాన్స్ వేస్తున్నాడని దిగువ హరిజనవాడకు చెందిన జగదీష్ మరికొందరు యువకులు ధనుష్‌పై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన ధనుష్‌ను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు ధనుష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


చౌకదుకాణాలు ఏర్పాటు చేయండి



ప్రజల సమస్యను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని పోతబోలు కొత్త కాలనీ, టిడ్కో ఇళ్ల వద్ద ప్రభుత్వ చౌకదుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రజలు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. పోతబోలు కొత్తకాలనీ ప్రజలు మాట్లాడుతూ తాము గతంలో మదనపల్లె పట్టణంలో నివసించామని, ఇప్పుడు పోతబోలు కాలనీలో 300 మంది ఇళ్లు నిర్మించుకుని నివాసమున్నామన్నారు. ఇక్కడ చౌక దుకాణం లేకపోవడంతో 400 కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనిపై సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సివిల్ సప్లైస్ డీటీ ఫిరోజ్‌ఖాన్‌ను తగు చర్యలు తీసుకుని రెండు చౌకదుకాణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మదనపల్లె మండలం బుద్ధుని కొండపై బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన వారిని గుర్తించడంలో తాలూకా పోలీసులు విఫలమయ్యారని బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

యల్లమ్మ జాతరలో చాందినీ బండ్లు



లలితా త్రిపురసుందరి అలంకారంలో యల్లమ్మ

కలికిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి నాలుగు రోజుల జాతర సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి తరువాత చాందినీ బండ్ల వేడుకలు వైభవంగా జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన చాందినీ బండ్లు పట్టణంలోని వీధుల్లో ఊరేగుతూ చివరికి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం వేకువజాము వరకు వేడుకలు కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. అనంతరం రాత్రి లంకా దహనం కార్యక్రమం, పుష్ప పల్లకిలో రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. కాగా ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం పార్వేట ఉత్సవంతో జాతర ముగుస్తుంది.

లలితా త్రిపురసుందరి అలంకారంలో యల్లమ్మ

జాతర మూడవ రోజు సోమవారం రాత్రి యల్లమ్మను లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో తీర్చిదిద్దారు. అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఏనుగు మల్లమ్మ అమ్మవారు

తంబళ్లపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండలో సోమవారం అశేషంగా తరలివచ్చిన భక్తులు శివనామ స్మరణలతో మార్మోగింది. రాయలసీమ జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు మల్లయ్యకొండకు విచ్చేసి భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప మల్లికార్జున స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తుల పేరిట అర్చనలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే కొండపైన గౌరమ్మ అమ్మవారికి, ఏనుగుమల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మునిరాజ్ అద్వర్యంలో కొండపై భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని మౌలిక వసతులు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ చూపాలి

● ఎంపీడీఓ శివశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పీలేరురూరల్, జూలై 14, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక చొరవ చూపాలని పీలేరు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రతి ఇంటి నుంచి నిత్యం తడి, పొడి చెత్త సేకరణ విధిగా జరగాలన్నారు. ఆయా పంచాయతీల్లో కార్యదర్శులు ఉదయం 6 గంటల నుంచి చెత్త సేకరణ ఇతర సమస్యలపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన విధిగా పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికల్లో చైతన్యం తీసుకురావాలి



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే బాలికలలో చైతన్యంతీసుకురావాలని ఎంఈవో మనోహర్, రీడో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డైరెక్టర్ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల తెలుగు హైస్కూల్‌లతో పాటు కలిచెర్ల జూనియర్ కళాశాలలో రీడో, అభయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అభయ భవిత, బాలికల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశలో విద్యతో పాటు ఆరోగ్య సూత్రాలను కూడా తెలుసుకోవాలన్నారు. అనంతరం బాలికల రక్షణ అంశంపై పోస్టర్లు విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, హెచ్ఎంలు మీననాగలక్ష్మీ, భాగ్యమ్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలసిన రమణారెడ్డి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో రమణారెడ్డి

మదనపల్లె, జూలై 14(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లు గోల్డెన్‌వ్యాలీ విద్యాసంస్థల అధినేత, బీజేపీ నాయకుడు ఎన్.వి.రమణారెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్‌ను కలిశారు. పార్టీ నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మాధవ్‌ను, విజయవాడ పార్టీ కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ సంస్థాగత జనరల్ సెక్రటరీ నూకల మధుకర్‌జీతో కలసి వెళ్లారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు, ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర సెక్రటరీ హోదాలో మాధవ్‌ను కలసినట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తంబళ్లపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మదనపల్లె ఆర్ఆర్ ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత చిన్నపిల్లల వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పురిటి పిల్లల నుంచి 18 ఏళ్లలోపు ఉన్న సుమారు 67 మందికి జలుబు, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వైద్యులు రామిరెడ్డి, ప్రీతి చెప్పారు. బలమైన, ఆరోగ్యకరమైన ఎదుగుదలలో పౌష్టికాహారం , ప్రాధాన్యత, చిన్నపిల్లలకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి సాధిద్దాం

కురబలకోట, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో అభివృద్ధి సాధిద్దామని ఎంపీపీ భూదేవి, ఎంపీడీవో గంగయ్యలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాభివృద్ధిని సాధిద్దామని, అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి అభివృద్ధిని సాధించాలన్నారు. అనంతరం ఎంపీటీసీ అమరనాథరెడ్డి మాట్లాడుతూ రైతులకు పంపిణీ చేసిన వేరుశనగ కాయల్లో నాణ్యత లోపించిందని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బి.జ్యోతి, ఎంపీడీవో గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో